తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం   సూర్యాపేట
యాద్రాద్రి భువనగిరి
సోమవారం
27 జూలై 2026
పేజీలు : 8
Follow :



# అగ్నికి ఆహుతైన 18 షాపులు
## నిర్లక్ష్యం కారణంగా రూ.3 కోట్ల వరకు ఆస్తి నష్టం






వార్తా లోపలి పేజీలో



## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి
### కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం జూలై 27 జనంసాక్షి..**
సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖిత పూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ భద్రాచలం కార్యాలయంలో, మరియు ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# రైతు భరోసాకు అధికారులే అడ్డుగోడ!

- వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు భారీ అన్యాయం
- పొలం చూడకుండానే పంటల నమోదు... ఊరి యువకుడితో సర్వే?
- రాజకీయ ప్రాతిపదికన వివరాల నమోదు చేశారన్న రైతుల ఆరోపణలు
- తమ్మడపల్లి క్లస్టర్‌లో అధికారుల బాధ్యతారాహిత్యంపై తీవ్ర ఆగ్రహం

**మర్రిగూడ, జూలై 26 (జనంసాక్షి)**
రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కారణంగా అర్హులైన రైతులు తీవ్రంగా నష్టపోయిన ఘటన మర్రిగూడ మండలం తమ్మడపల్లి క్లస్టర్‌లో వెలుగుచూసింది. రైతుల పొలాల్లోకి వెళ్లి పంటలను ప్రత్యక్షంగా పరిశీలించి నమోదు చేయాల్సిన వ్యవసాయ అధికారి ఆ బాధ్యతను పూర్తిగా విస్మరించి, గ్రామానికి చెందిన ఓ యువకుడితో ఫోటోలు తీయించి ఇష్టానుసారంగా పంట వివరాలు నమోదు చేయించినట్లు రైతులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు.




ప్రభుత్వ మార్గదర్శకాలను తుంగలో తొక్కి, క్షేత్రస్థాయిలో పర్యటించకుండానే నమోదు ప్రక్రియను ముగించడంతో అనేక మంది రైతుల వివరాలు తప్పుగా నమోదయ్యాయని, మరికొందరి పేర్లు పూర్తిగా గల్లంతయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా నెలల తరబడి కష్టపడి సాగు చేసిన రైతులకు అందాల్సిన రైతు భరోసా నిధులు నిలిచిపోయాయని వారు మండిపడుతున్నారు.

రైతుల ఆరోపణల ప్రకారం, పంటల నమోదు ప్రక్రియలో పారదర్శకత లేకుండా రాజకీయ ప్రభావానికి లోనై కొందరికి ప్రాధాన్యం ఇచ్చి, మరికొందరిని ఉద్దేశపూర్వకంగా విస్మరించినట్లు తెలుస్తోంది. రైతు సంక్షేమ పథకాన్ని కూడా రాజకీయ కోణంలో చూడడం దురదృష్టకరమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వ పథకాలను నిర్వీర్యం చేస్తున్నది ఎవరు?**
రైతు భరోసా వంటి కీలక పథకాల అమలులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రభుత్వం ప్రకటిస్తున్న సంక్షేమ పథకాల ఉద్దేశం ఎలా నెరవేరుతుందనే ప్రశ్న రైతుల నుంచి వినిపిస్తోంది. రైతుల జీవనాధారమైన వ్యవసాయాన్ని కాగితాలకే పరిమితం చేసి, క్షేత్రస్థాయిలో వాస్తవాలను పట్టించుకోని అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి**
ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్వతంత్ర విచారణ చేపట్టి, పంటల నమోదులో జరిగిన లోపాలను సరిదిద్దడంతో పాటు, నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంబంధిత అధికారిపై కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అర్హులైన ప్రతి రైతుకు రైతు భరోసా నిధులు అందేలా ప్రత్యేక పునఃపరిశీలన నిర్వహించాలని వారు కోరుతున్నారు.

# ఒకే గదిలో హెచ్‌ఎం రూం.. స్టాఫ్ రూం.. తరగతి గది.. స్టోర్ రూం..!



## రాయికంపాడు యూపీఎస్‌లో మౌలిక వసతుల కొరత ?
### నాలుగు అదనపు గదులు, ఖాళీ పోస్టుల భర్తీకి విజ్ఞప్తి

**చంద్రుగొండ, జనంసాక్షి:**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం రాయికంపాడు ఉన్నత ప్రాథమిక పాఠశాల (యూపీఎస్)లో మౌలిక వసతుల లేమితో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రీ-ప్రైమరీ నుంచి 8వ తరగతి వరకు మొత్తం 88 మంది విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలలో కేవలం నాలుగు గదులు మాత్రమే ఉండటం తో బోధన సక్రమంగా నిర్వహించడం కష్టంగా మారింది. మొత్తం తొమ్మిది తరగతులు నిర్వహించాల్సి ఉండగా, ఒకే గదిని హెడ్‌మాస్టర్ గది, స్టాఫ్‌రూమ్, తరగతి గది, స్టోర్‌రూమ్‌గా వినియోగించాల్సిన పరిస్థితి నెలకొంది. వంటగది లేకపోవడంతో మధ్యాహ్న భోజనాన్ని ఆరుబయటే వండాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాఠశాలలో బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయ పోస్టు, పీఈటీ పోస్టు ఖాళీగా ఉన్నాయి. మొత్తం ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా, ఇద్దరు ఉపాధ్యాయులు డిప్యూటేషన్‌పై మధుకూరు

మిగతా 2లో

# అగ్నికి ఆహుతైన 18 షాపులు





**నల్లగొండ, జూలై 26 (జనం సాక్షి):** నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ప్రసిద్ధ చెర్వుగట్టు పుణ్యక్షేత్రంలో ఆదివారం తెల్లవారుజామున భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. తెల్లవారుజామున 3 గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో సుమారు 18 షాపులు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. షార్ట్‌సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. తొలి ఏకాదశి పర్వదినం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని భావించిన షాపుల నిర్వాహకులు భారీగా సరుకును కొనుగోలు చేసి నిల్వ చేసుకున్నారు.

అయితే అగ్ని ప్రమాదంతో షాపుల్లోని సరుకంతా పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోయినప్పటికీ భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది. సుమారు రూ.3 కోట్ల వరకు నష్టం జరిగినట్లు బాధితులు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన కార్యాలయం సైతం పూర్తిగా దగ్ధమైంది. కార్యాలయంలోని విలువైన పత్రాలు, రికార్డులు కూడా కాలిపోయినట్లు తెలుస్తోంది.

**రోడ్డున పడ్డ కుటుంబాలు**

గత 25 ఏళ్లుగా చెర్వుగట్టు పుణ్యక్షేత్రంలో బొమ్మలు, చిల్లర సామగ్రి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న కుటుంబాలు ఈ అగ్ని ప్రమాదంతో తీవ్రంగా నష్టపోయాయి. రూపాయి రూపాయి కూడబెట్టుకున్న తమ జీవితకాల సంపాదన కళ్లముందే బూడిదైందని బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. ఓ బాధిత కుటుంబం తమ కుమార్తె వివాహం కోసం దాచుకున్న సుమారు 30 తులాల బంగారం, రూ.50 లక్షల నగదు, భూమికి సంబంధించిన పత్రాలు, పిల్లల విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లు మంటల్లో కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేసింది. మరో బాధితుడు రూ.4.50 లక్షల నగదు, మరికొందరు బంగారు ఆభరణాలు, నగదు కోల్పోయినట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమను ఆదుకోవాలని బాధిత కుటుంబాలు కోరుతున్నాయి.

**ప్రభుత్వం న్యాయం చేయాలి**

గ్రామ పంచాయతీకి సుమారు రూ.3.20 లక్షలు చెల్లించి లీజుకు తీసుకున్న షాపుల నిర్వాహకులతో పాటు, తమ ఇళ్లు, జీవనోపాధి పూర్తిగా కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. తాము చెల్లించిన లీజు మొత్తాన్ని తిరిగి ఇవ్వడంతో పాటు, ప్రత్యామ్నాయంగా ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

**ఫైర్ సిబ్బంది ఆలస్యంపై బాధితుల ఆగ్రహం**

అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో ఫైర్ ఇంజిన్ రావడంలో తీవ్ర జాప్యం జరిగిందని బాధితులు ఆరోపించారు.

వచ్చిన ఫైర్ ఇంజిన్‌లో నీళ్లు సక్రమంగా రాకపోవడంతో మంటలను అదుపులోకి తీసుకురావడంలో ఆలస్యం జరిగిందని తెలిపారు. మరో ఫైర్ ఇంజిన్ వచ్చేలోపు మంటలు పెద్ద ఎత్తున వ్యాపించి షాపులన్నీ పూర్తిగా దగ్ధమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో అగ్నిమాపక వాహనాలు చేరుకుని ఉంటే ఇంత భారీగా ఆస్తి నష్టం జరిగేది కాదని బాధితులు పేర్కొన్నారు.



# ఒకే గదిలో హెచ్‌ఎం రూమ్.. స్టాఫ్‌రూమ్.. తరగతి గది.. స్టోర్‌రూమ్..!

ప్రాథమిక పాఠశాల, వెంకటాయ తండా పాఠశాలలకు వెళ్లడంతో ప్రస్తుతం కేవలం ఆరుగురు ఉపాధ్యాయులతోనే విద్యాబోధన కొనసాగుతోంది. విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి పాఠశాలకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. పాఠశాల పాఠశాలకు నాలుగు అదనపు తరగతి గదులు అవసరం ఉంది :హెచ్‌ఎం రమణ

**అత్యవసరంగా నాలుగు గదులు అవసరం**

పాఠశాలకు మరో నాలుగు తరగతి గదులు అవసరం ఉంది. బయోలాజికల్ సైన్స్, పీఈటీ పోస్టులను గా ఉన్నాయి. అలాగే వంటగది నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది.

# ప్రధాని మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని వీక్షించిన కిసాన్ మోర్చా నాయకులు






**చింతకాని , జులై 26 (జనంసాక్షి)** ప్రధాని నరేంద్రమోదీ నిర్వహించే 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని ఖమ్మం జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో చింతకాని మండలం పాటర్లపాడు గ్రామంలో నిర్వహించారు. గ్రామానికి చెందిన బుర్రా శ్రీను నివాసం వద్ద మండల అధ్యక్షులు కొండా గోపీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఖమ్మం జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు నరుకుళ్ల వెంకటేశ్వర రావు, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుకూరి రమేష్ హాజరయ్యారు. సీనియర్ నాయకులు మందనపు సుబ్బారావు, మద్దిన్ని వెంకటేశ్వరరావు, మండేపూడి వీరనాగేశ్వరరావు, దొడ్డపిన్నీ కృష్ణయ్య, ఏనుగుల సుమన్, కొమ్మిన్ని కృష్ణారావు, చింతనిప్పు రామారావు, కొండా వెంకన్న తమండల నాయకులు ఇమ్మడి సత్యనారాయణ, కొండా వెంకన్న, కోరిపల్లి శ్రీను, సిద్ధార్థ, కోయిన్ని నరసింహారావు, వేముల ఎల్లయ్య, నారపగు నరసింహారావు, బల్లి పిచ్చారావు, మల్లేశ్వరరావుతో పాటు పలువురు కార్యకర్తలు, రైతులు పాల్గొని ప్రధాని నరేంద్రమోదీ 'మన్ కీ బాత్' సందేశాన్ని వీక్షించారు.

# రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడు అజీమ్‌కు ఘన సన్మానం



**బూర్గంపహాడ్ జూలై 26 (జనంసాక్షి)** భద్రాచలం రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన అజీమ్‌ను సారపాకకు చెందిన ముస్లిం కార్మిక సోదరులు ఆదివారం ఘనంగా సన్మానించారు. పూలదండలు, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, సాధారణ కార్మికునిగా జీవితాన్ని ప్రారంభించి రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం అజీమ్ ప్రస్థానానికి నిదర్శనమని కొనియాడారు. మారుమూల గ్రామం నుంచి వచ్చిన ఆయన చిన్నప్పటి నుంచే సేవాభావాన్ని అలవర్చుకుని, నాయకత్వ లక్షణాలతో భద్రాచలంలో గుర్తింపు పొందిన నాయకుడిగా ఎదిగారని పేర్కొన్నారు. వివిధ సామాజిక, రాజకీయ పదవుల్లో సేవలందించిన ఆయనకు రోటరీ క్లబ్ అధ్యక్ష పదవి దక్కడం తమ కమ్యూనిటీకి గర్వకారణమని అన్నారు. అజీమ్ చేస్తున్న సేవలకు ఈ సన్మానం చిన్న గుర్తింపు మాత్రమేనని, భవిష్యత్తులో ఆయన సేవా కార్యక్రమాలు మరింత విస్తరించి ఎందరికో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఆయనకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తూ, సమాజ సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకుడు షేక్ అబ్దుల్ సలీం, మేవా కమిటీ సభ్యులు మొహమ్మద్ ముస్తఫా, జహీర్ భాషా, మొహమ్మద్ సోహెల్ పాషా, సైదుద్దీన్, ఇమ్రాన్, ఎడియుల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు సాబీర్, కార్మిక నాయకులు, కార్మిక సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# 57 లీటర్ల నాటు సారాయి, ఒక ద్విచక్రవాహనం పట్టివేత



**భద్రాచలం జూలై 26 (జనంసాక్షి)** భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని చర్ల మండలం కలివేరు గ్రామంలోని క్యాంపు కు సమీపం లో ఖమ్మం ఎన్ఫోర్స్?మెంట్ ఎస్సై సీహెచ్ శ్రీహరి రావు , సిబ్బంది కలిసి వాహన తనిఖీలు నిర్వహించగా 40 లీటర్ల నాటు సారాయి తో ఒక ద్విచక్ర వాహనం పట్టుబడింది. తదుపరి భద్రాచలం పట్టణంలోని నాటు సారాయి అమ్మకం దారులపై తనిఖీలు నిర్వహించగా 17 లీటర్ల తో ముగ్గురు వ్యక్తులు పట్టుబడినారు. ద్విచక్ర వాహనం, పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి మొత్తం 57 లీటర్ల నాటు సారాయి, ద్విచక్ర వాహనం ని భద్రాచలం ఎక్సైజు పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహ్మద్, కానిస్టేబుల్స్? వీరబాబు,ప్రసన్న కుమార్,తిరుపతి, ఉపేందర్ లు పాల్గొన్నారు.

# ఐద్వా భద్రాచలం పట్టణ అధ్యక్షురాలిగా గంటి జీవనజ్యోతి



**భద్రాచలం జూలై 26 (జనంసాక్షి)** అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) భద్రాచలం పట్టణ అధ్యక్షురాలిగా గంటి జీవనజ్యోతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక చంద్రరావు భవనంలో సీనియర్ నాయకురాలు నాదెండ్ల లీలావతి అధ్యక్షతన జరిగిన ఐద్వా భద్రాచలం పట్టణ విస్తృత స్థాయి జనరల్ బాడీ సమావేశంలో గడ్డి జీవనజ్యోతిని భద్రాచలం పట్టణ అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటివరకు జిల్లా కమిటీ సభ్యురాలిగా ఐద్వా పట్టణ కార్యదర్శి వర్గ సభ్యురాలిగా జీవనజ్యోతి పలు మహిళ ఉద్యమాలలో కీలక పాత్ర పోషించారు. గంటి జీవనజ్యోతి ఎన్నిక పట్ల పలువురు సీనియర్ అద్వానాయకులు తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. జీవనజ్యోతి తో పాటు పట్టణ కార్యదర్శ వర్గ సభ్యురాలుగా గడ్డం నాగలక్ష్మి దేవ గుప్త కనక శ్రీ లను ఎన్నుకోగా నూతన పట్టణ కమిటీ సభ్యురాలిగా బెన్నీ స్వరూప పుప్పాల సీతలను ఐద్వా భద్రాచలం పట్టణ నూతన కమిటీలోకి తీసుకున్నారు.



# గాంధీచౌక్ వరప్రదాత షిర్డిసాయి మందిరంలో శ్రీ సాయి సత్యవ్రతం



**ఖమ్మం, (జనంసాక్షి) :** ఖమ్మం గాంధీచౌక్‌లోని వరప్రదాత షిర్డిసాయి మంది రంలో 16వ గురుపౌర్ణమి మహోత్సవాల సందర్భంగా ఆదివారం శ్రీ సాయినాథునికి గోధుమలతో మహాభిషేకం, అనంతరం శ్రీ సాయి సత్యవ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది దంపతులు శ్రీ సాయి సత్యవ్రతంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పుట్టపర్తికి చెందిన జ్ఞాన సరస్వతి చాగంటి వెంపల అన్నాజీ సాయిరాం ఆధ్యాత్మిక ప్రవచనాలు చేసి భక్తులను ఆధ్యాత్మిక సందేశాలతో అలరించారు. ఈ కార్యక్రమానికి భద్రాద్రి బ్యాంక్ చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి, రాజ్యలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమాలు మందిర చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. మందిర ప్రధాన పూజారులు కిరణ్ శర్మ, జనార్ధనాచార్యులు, అర్వపల్లి నిరంజన్, పీవీడీ ప్రసాద్, కురువెళ్ల జగన్‌మోహన్‌రావు, వేల్పూరి సత్యనారాయణ, డాక్టర్ వేములపల్లి నరేష్, గన్నవరపు నాగేశ్వరరావు, సిమెంట్ మురళి, అలాగే ఖమ్మం నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, వైద్యులు మరియు భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## భక్తి శ్రద్దలతో బోనాల జాతర

**భద్రాచలం జూలై 26 (జనంసాక్షి)**
ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని భద్రాచలం పట్టణ లోని అశోక్ నగర్ కొత్త కాలనీ ముత్యాలమ్మ అమ్మవారి కమిటీ అధ్వర్యంలో బోనాల జాతరను ఆదివారం భక్తి శ్రద్దలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా, అనంతరం మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలను తలపై మోసుకుంటూ మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని భక్తులు ప్రార్థించారు. కార్యక్రమంలో అశోక్ నగర్ కొత్త కాలనీ ముత్యాలమ్మ అమ్మవారి కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుమా ప్రతి ఏడాది ఆషాడ మాసంలో బోనాల జాతరను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తామని, ప్రజల సహకారంతో ఈ ఏడాది కూడా వేడుకలను ఘనంగా నిర్వహించామని తెలిపారు.





## ట్రాన్స్ ఫార్మర్లను టార్గెట్ చేస్తూ వరుస చోరీలకు పాల్పడుతున్న గుర్తు తెలియని వ్యక్తులు

**నేరేడుచర్ల (జనంసాక్షి):**
పట్టణ పరిధిలోని పాత నేరేడుచర్ల,జానలదిన్నె పరివాహక ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను టార్గెట్ చేస్తూ వరుస చోరీలకు పాల్పడుతున్నారని ఆ ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.గత 15 రోజుల నుండి వేర్వేరు చోట్ల రెండు సార్లు ట్రాన్స్ ఫార్మర్లలోని బుషులు, తదితర సామాగ్రి చోరీకి గురైందని తెలిపారు.ఇప్పటికే వర్షాకాలంలో ఎలినో ప్రభావంతో వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.బోర్లు, బావుల సహాయంతో అరకొరా వ్యవసాయం చేస్తున్న నేపథ్యంలో ఇలా వరుస చోరీలతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.ట్రాన్స్ ఫార్మర్ల సామాగ్రి చోరి అయినప్పుడల్లా 4 నుండి 5 వేలు ఖర్చు వస్తుందన్నారు. ఇక ట్రాన్స్ ఫార్మర్ ఆయిల్ లీకైతే 10 వేలు ఖర్చు దాటుతుందన్నారు.గత 15 రోజులలో దాదాపు 25 ట్రాన్స్ ఫార్మర్ల పరికరాలు చోరీకి గురైనట్లు తెలిపారు.పోలీసులు స్పందించి మరోసారి దొంగతనాలు జరగకుండా చర్యలు చేపట్టాలని రైతుల కోరారు.



## స్పందనలో స్పీడ్.. సేవలో నిబద్ధత..

### సర్పంచ్ జాల యాదయ్యకు ప్రజల ప్రశంసలు

**గుర్రంపోడు, జూలై 26 (జనంసాక్షి)**
ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలపై వెంటనే స్పందిస్తేనే ప్రజాప్రతినిధి పనితనం తెలుస్తుందని మరోసారి నిరూపించారు గుర్రంపోడు గ్రామ సర్పంచ్ జాల యాదయ్య. గ్రామంలోని 2వ వార్డులో తాగునీటి పైప్‌లైన్ లీకేజీ ఏర్పడి నీటి సరఫరాకు అంతరాయం కలగడంతో స్థానికులు ఆందోళన చెందారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ జాల యాదయ్య ఆలస్యం చేయకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించి, వెంటనే మరమ్మత్తు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. సర్పంచ్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గంటల వ్యవధిలోనే లీకేజీని పూర్తిగా సరిచేశారు. దీంతో తాగునీటి సరఫరా తిరిగి సాధారణ స్థితికి చేరుకుంది.మరమ్మత్తు పనులను వార్డు సభ్యులు షేక్ అమీర్, షేక్ సయ్యిద్, పోలేపల్లి రమేష్ దగ్గరుండి పర్యవేక్షించారు.తాగునీటి సమస్యను వెంటనే గుర్తించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకున్న సర్పంచ్ జాల యాదయ్య, వార్డు సభ్యులు, మున్సిపాలిటీ సిబ్బందిపై 2వ వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఇదే చొరవ కొనసాగాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

## భద్రాచలంలో తూనికలు కొలతల అధికారులు తనిఖీలు

**భద్రాచలం జూలై 26 (జనంసాక్షి)**
భద్రాచలం పట్టణంలో ఆదివారం తూనికల కొలతల అధికారి సుభాష్ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని చికెన్ మార్కెట్ అంబేద్కర్ సెంటర్ పాత కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించి తప్పుడు కొలతలతో వ్యాపారం చేస్తున్న 14 మంది వ్యాపారస్తులకు జరిమానా విధించారు. ప్రధానంగా చికెన్ మార్కెట్లో పలువురు వ్యాపారస్తులు కాటా మోసానికి పాల్పడుతున్నారని తేల్చి వారికి హెచ్చరికలు జారీ చేసి జరిమానా విధించారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులను ఉద్దేశించి తూనికల కొలతల ఇన్స్పెక్టర్ సుభాష్ మాట్లాడుతూ వినియోగదారుడికి న్యాయమైన కొలతలతో వస్తువులను విక్రయించాలని సూచించారు. కాటా మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారుల సైతం కాటా మోసాలను గ్రహించాలని కోరారు. ఏ వ్యాపారైన ఖాతా మోసానికి పాల్పడితే తూనికల కొలతల కార్యాలయానికి సమాచారాన్ని అందివ్వాలని ప్రజల్ని సుభాష్ కోరారు. పట్టణంలో అకస్మాత్తుగా తూనీల కొలతలు అధికారులు తనిఖీ చేయడం పట్ల పలువురు హర్షణ వ్యక్తం చేస్తున్నారు.





## మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

**సూర్యాపేట (జనంసాక్షి):**
పర్యావరణ పరిరక్షణలో గ్రీన్ క్లబ్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి.షఫీఉల్లా అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని శ్రీసరస్వతీ విద్యా నిలయం ఆవరణలో గ్రీన్ క్లబ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కల నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం, అడవుల విస్తీర్ణం తగ్గిపోవడం వల్ల వర్షపాతం తగ్గుతుందని అన్నారు.పర్యావరణ సమతుల్యత కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.గ్రీన్ క్లబ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతను స్కూల్ కరస్పాండెంట్ పర్వతం శ్రీధర్ స్వీకరించారు.ఈ సందర్భంగా 8వ తరగతి విద్యార్థిని తోట శ్రీనిధి మొక్కలపై అవగాహన కల్పించే పాటతో ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ సభ్యులు ముప్పారపు నరేందర్, డాక్టర్ తోట కిరణ్, మీలా మహదేవ్, ఉప్పల శ్రవణ్, వందనపు శ్రీదేవి, ముప్పారపు నాగేశ్వరరావు, దేవరశెట్టి నాగరాజు, సోమ హేమమాలిని, మిట్టపల్లి సువర్ణలక్ష్మి, మారం పవిత్ర, మన్మథ రెడ్డి, శ్యామ్, వెంకట్, అలేఖ్య, సురేందర్, దారం శ్రీనివాస్, రామచంద్రయ్య, సరస్వతి స్కూల్ కరస్పాండెంట్ పర్వతం శ్రీధర్, వైస్ చైర్మన్ గుండా రమేష్, నాగవల్లి ప్రభాకర్, కొత్త మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డు లబ్ధిదారులు ఈ కేవైసీ చేయకుంటే రేషన్ కట్

### ❑జులై 31వరకే ఈ కేవైసీ చివరి అవకాశం ❑మండల పౌర సరఫరాల అధికారి సయ్యద్ ముబీన్

**కొండమల్లేపల్లి, జులై 26 (జనంసాక్షి):**
రేషన్ కార్డులో నమోదైన ప్రతి కుటుంబ సభ్యుడు బయోమెట్రిక్ లేదా ఐరిస్ ధ్రువీకరణను రేషన్ దుకాణంలో లేదా మీ సేవాలో రేషన్ కార్డు ఈ కేవైసీ జులై 31లోపు తప్పకుండ పూర్తి చేయాలని లేని పక్షంలో ఈ కేవైసీ పూర్తి చేయని కుటుంబాలకు రాయితీ రేషన్‌తో పాటు ఆహార భద్రతా కార్డు ద్వారా అందే పలు ప్రభుత్వ సంక్షేమ ప్రయోజనాలు నిలిచిపోయే అవకాశం ఉందని కొండమల్లేపల్లి మండల పౌర సరఫరాల అధికారి సయ్యద్ ముబీన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ సూచనల ప్రకారం రేషన్ కార్డులో నమోదైన ప్రతి కుటుంబ సభ్యుడు తప్పనిసరిగా బయోమెట్రిక్ లేదా ఐరిస్ స్కాన్ ద్వారా ప్రామాణీకరణ పూర్తి చేయాలన్నారు. కుటుంబంలో ఒక్కరి ఇ-కేవైసీ మాత్రమే పూర్తి చేయడం సరిపోదని కార్డులో పేరున్న ప్రతి సభ్యుడి వివరాలను ధృవీకరించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలనుకునే వారు రేషన్ దుకాణం లేదా సమీపంలోని మీసేవా కేంద్రాన్ని సందర్శించవచ్చునని అక్కడ ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ లేదా ఐరిస్ ధృవీకరణ ద్వారా ఇ-కేవైసీ పూర్తవుతుందన్నారు. ఇందుకోసం ఒరిజినల్ రేషన్ కార్డుతో పాటు రేషన్ కార్డులో నమోదైన ప్రతి కుటుంబ సభ్యుడి ఒరిజినల్ ఆధార్ కార్డు వెంట తీసుకెళ్లడం తప్పనిసరి అన్నారు. ఈ కేవైసీ ప్రక్రియను పూర్తి చేయడానికి ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఇది పూర్తిగా ఉచితంగానే చేస్తారని కొండమల్లేపల్లి మండల పౌర సరఫరాల శాఖ అధికారి స్పష్టం చేశారు. ఇ-కేవైసీ పేరుతో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే మాకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజమైన అర్హులకే చేరేలా చూడడం నకిలీ లేదా క్రియాశీలంగా లేని రేషన్ కార్డులను గుర్తించడం లబ్ధిదారుల వివరాలను నవీకరించడం కోసం ఈ ఇ-కేవైసీ ప్రక్రియను ప్రభుత్వం చేపట్టిందన్నారు. అందువల్ల గడువు తేదీ వరకు వేచి ఉండకుండా వీలైనంత త్వరగా ఇ-కేవైసీ పూర్తి చేసుకోవాలని రేషన్ కార్డుదారులకు సూచించారు. జులై 31 తర్వాత ఇ-కేవైసీ పూర్తి చేయని కుటుంబాలకు రేషన్ పంపిణీ ఇతర ఆహార భద్రతా సేవల్లో అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నందున రేషన్ కార్డులో పేరున్న ప్రతి సభ్యుడు తప్పనిసరిగా ధృవీకరణ పూర్తి చేసుకోవడం అవసరమని పౌరసరఫరాల మండల అధికారి సయ్యద్ ముబీన్ పేర్కొన్నారు.





# కూసుకుంట్ల మాటలు వింటే నవ్వొస్తోంది

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మేకల సాగర్ రెడ్డి ధ్వజం..



**చండూరు, జూలై 26 (జనంసాక్షి)**
మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడిన మాటలు వింటుంటే నవ్వు వస్తోందని, ఉనికి కాపాడుకోవడానికే ఆయన పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని చండూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేకల సాగర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. కూసుకుంట్ల తాను చేసిన తప్పులన్నీ గుర్తుచేసుకుంటూ, అవే తప్పులను కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డిపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లో నీతి, నిజాయితీ, విలువల కాపాడుతూ రాజకీయం చేస్తున్న ఏకైక నాయకుడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి అని కొనియాడారు. ఆయన మునుగోడు శాసనసభ్యుడిగా ఉండడం వల్ల ఈ ప్రాంత రైతులు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు మరియు పేద కుటుంబాలన్నీ ఎంతో సంతోషంగా ఉన్నాయని స్పష్టం చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల పేరుతో జరిగిన లూటీ అంతా స్వతంత్ర సంస్థ అయిన 'కాగ్' నివేదికతో బహిర్గతమైందని సాగర్ రెడ్డి గుర్తుచేశారు. చేసిన ద్రోహానికి జీవితాంతం పశ్చాత్తాపపడాల్సింది పోయి, సిగ్గు లేకుండా ప్రాజెక్టుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణను దోచుకున్న చరిత్ర బీ.ఆర్ఎస్ నాయకులదేనని మండిపడ్డారు.గతంలో తన వెంట లేకపోయినా, కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు రాజ్ గోపాల్ రెడ్డి తగిన గుర్తింపు నిచ్చారని తెలిపారు. సొంత నిధులతో ఎందరో నాయకులను సర్పంచులుగా, ఎంపీటీసీలుగా, జడ్పీటీసీలుగా, ఎమ్మెల్యేలుగా గెలిపించిన ఘనత ఆయనదేనన్నారు. గతంలో దళితుల టికెట్ల కోసం కొట్లాడి, అవసరమైతే తన సీటును సైతం త్యాగం చేయడానికి సిద్ధపడి దళిత నాయకులను గెలిపించిన గొప్ప మనసున్న వ్యక్తి రాజ్ గోపాల్ రెడ్డి అని కొనియాడారు.ఉద్యమ పునాదులపై ఏర్పడిన బీఆర్ఎస్ పార్టీలో ఉంటూ, ఉద్యమకారులను మోసం చేసి ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి పదవులు కట్టబెట్టిన చరిత్ర కూసుకుంట్లదని ఆరోపించారు. మీకు వ్యతిరేకంగా పాంప్లెట్లు పంచిన సొంత పార్టీ కార్యకర్తలను, ఉద్యమకారులను కిడ్నాప్ చేయించి కొట్టించిన ఘనత కూడా మీదేనని మేకల సాగర్ రెడ్డి ఎద్దేవా చేశారు.కమిషన్ల పాలనకు ప్రజలు బుద్ధి చెప్పారు వైన్స్ వ్యాపారుల నుంచి మొదలుకొని చిన్న చిన్న కాంట్రాక్టర్ల వరకు, చివరకు ప్లైలాన్ నిర్మాణంలో కూడా కమిషన్లు వదలకుండా తిన్న కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి.. నీతిమంతుడైన రాజ్ గోపాల్ రెడ్డి గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఈ ప్రాంతంలో కూసుకుంట్ల చేసిన పనుల వల్ల ప్రజలు ఆయనకు సరైన బుద్ధి చెప్పి ఇంటికి పంపించారని, ప్రజలంతా తన్ను మర్చిపోయారనే భయంతోనే ఇప్పుడు ఉనికి కోసం ప్రెస్ మీట్లు పెడుతున్నారని విమర్శించారు.గోతి కాడ నక్కలా.. ఎదురుచూస్తున్న కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి జీవితంలో మళ్లీ ఎమ్మెల్యే కాలేరని, ఆయన కేవలం 'ఎక్స్ ఎమ్మెల్యే'గానే మిగిలిపోతారని మేకల సాగర్ రెడ్డి స్పష్టం చేశారు.



# గౌడ వృత్తికి రక్షణ కల్పించాలి

- గీత కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి
- గౌడ కళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి
- సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోడూరి పరశురాం

**సూర్యాపేట(జనంసాక్షి):**
గౌడ వృత్తికి రక్షణ కల్పించి, గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోడూరి పరశురాం కోరారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ ఫంక్షన్ హాల్లో రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు గిలకత్తుల రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర సాంస్కృతిక విభాగం ఆత్మీయ సమావేశంకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.గౌడ కులస్తులకు రావాల్సిన సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందించాలని కోరారు. గౌడ కళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు గీత కార్మికుల జీవనోపాధికి భరోసా కల్పించే చర్యలు చేపట్టాలని అన్నారు. తాటి చెట్లపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడిన గీత కార్మికులకు మెరుగైన వైద్య సదుపాయాలు, ఆర్థిక సహాయం అందించాలని, గీత కార్మికులకు గృహ స్థలాలు, ఇళ్ల వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సంఘ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కుర్ర పరశురామ్ గౌడ్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు పులుసు వెంకన్న గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గూడాల రాజేష్ గౌడ్, కర్న్యాజా తిరుపతి గౌడ్, జూలూరు అంజయ్య గౌడ్, కరీంనగర్ జిల్లా అధ్యక్షురాలు తాళ్లపల్లి సంధ్య గౌడ్, సూర్యాపేట జిల్లా డాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు తంధరపల్లి రాము గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు బైరు శ్రీనివాస్ గౌడ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు గిలకత్తుల నాగమణి గౌడ్, రాష్ట్ర సాంస్కృతిక విభాగ ఉపాధ్యక్షుడు బండకాడి గణేష్ గౌడ్, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు మండవ ఉపేందర్ గౌడ్, హుజూర్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షులు వల్లపుదాసు సైదులు గౌడ్, సూర్యాపేట నియోజకవర్గ అధ్యక్షులు గుండగాని సుదర్శన్ గౌడ్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలు శీలం కనక మహాలక్ష్మి గౌడ్, నల్గొండ జిల్లా అధ్యక్షురాలు వంగల సుమలత గౌడ్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు బాసంపల్లి నరేష్ గౌడ్, జనగామ జిల్లా అధ్యక్షుడు మాచర్ల రమేష్ గౌడ్, యాదాద్రి జిల్లా అధ్యక్షురాలు సత్యశ్రీ, గాయకులు ఎర్ర అనుదీప్, చెరుకు శైలేందర్, కందుకూరి శ్రీకాంత్, జిల్లపల్లి నరేష్, వీరబాబు, సలీం తదితరులు పాల్గొన్నారు.



# కుమ్మరి వృత్తి అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

**సూర్యాపేట( జనంసాక్షి):**
కుమ్మరి వృత్తి అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి, కుమ్మరి కుటుంబాలకు అండగా నిలవాలని తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నడికుడ జయంత్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి దయానంద అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కుమ్మరి సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సంఘ కార్యదర్శి నాగపురి నగేష్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎగిరిశెట్టి వీరన్న,సంఘ సీనియర్ నాయకులు ఎలగందుల వెంకటేశ్వర్లుతో కలిసి వారు సూర్యాపేట జిల్లా అడహక్ ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా సలిగంటి శ్రీనివాస్, కో కన్వీనర్ గా ఖమ్మంపాటి మధు, జిల్లాలోని సూర్యాపేట నియోజకవర్గ ఇన్చార్జిగా సలిగంటి వీరేంద్ర, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్చార్జిగా కోటమర్తి శ్రీనివాస్, కోదాడ నియోజకవర్గ ఇన్చార్జిగా చలిగంటి రామారావు, కో కన్వీనర్ గా బాడిస రామారావు, హుజూర్ నగర్ నియోజకవర్గ ఇన్చార్జిగా సంజీవరావును ఎన్నుకున్నారు. సూర్యాపేటకు పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు త్వరలో అడహక్ కమిటీలు మండల, గ్రామ కమిటీలను ఎన్నుకోవాలని నిర్ణయించారు.అనంతరం వారు మాట్లాడుతూ సంప్రదాయ కుమ్మరి వృత్తిని పరిరక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేయాలని, మట్టి కళాకారు లకు ఆర్థిక సహాయం, ఆధునిక పరికరాలు, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు.కుమ్మరి వృత్తిదారుల సంక్షేమం కోసం సంఘం ఐక్యంగా పోరాడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు రేణుబాబు, సలిగంటి శ్రీనివాస్, మామిడి రామారావు, సిరివెళ్ల లక్ష్మీకాంతారావు, వెంకటేశ్వర్లు, సలికొప్పుల నాగేశ్వరరావు, బొడ్డుపెల్లి బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**సూర్యాపేట (జనంసాక్షి):**
1981-82 విద్యా సంవత్సరంలో జిల్లా కేంద్రంలోని యూపీఎస్ నంబర్-1లో ఏడవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంను ఆదివారం జిల్లా కేంద్రంలోని బాలాజీ గ్రాండ్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నాటి విద్యార్థులు తమ విద్యార్థి దశలోని మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనందంగా గడిపారు.నాటి ఉపాధ్యాయుల బోధన, మార్గదర్శకత్వంలో తాము నేడు ఉన్నత స్థాయిలో ఉన్నామని అన్నారు.అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు నర్సయ్యను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో నాటి విద్యార్థులు ఎల్గూరి పాండు గౌడ్, కక్కిరేణి చంద్రశేఖర్, సుధాకర్, గోపినాథ్, రాజశేఖర్, వీరయ్య, స్వరూపరాణి, కాంతమ్మ, నవనీత, ముంతాజ్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థుల సర్టిఫికెట్ల జారీలో జాప్యంపై సీపీఐ ఆగ్రహం

**- తహసిల్దార్ కార్యాలయం ముట్టడికి సిద్ధం: సీపీఐ హెచ్చరిక**

బూర్గంపహాడ్ జూలై 26 (జనంసాక్షి) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల తహసిల్దార్ కార్యాలయంలో విద్యార్థులకు అవసరమైన ఆదాయం, కులం, నివాస తదితర ధ్రువపత్రాలు సకాలంలో జారీ చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) మండల నాయకులు ఆరోపించారు.తహసిల్దార్ కార్యాలయం ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, సర్టిఫికెట్ల జారీలో నిర్లక్ష్య ధోరణి అవలంబించడం బాధాకరమని సీపీఐ నాయకులు విమర్శించారు. విద్యార్థులకు సంబంధించిన దర ఖాస్తులను అనవసరంగా ఆలస్యం చేయకుండా, సకాలంలో ధ్రువపత్రాలు జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించి, సర్టిఫికెట్ల జారీలో పారదర్శకత, వేగం తీసుకురావాలని కోరుతూ, తాసీల్దార్ వైఖరిలో మార్పు రాకపోతే విద్యార్థులు, ప్రజల తరఫున సీపీఐ ఆధ్వర్యంలో తాసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. స్థానిక ప్రజలు, విద్యార్థుల సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని సీపీఐ నాయకులు ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు.

# మునుగోడును ఎడారిగా మారుస్తుంటే రాజగోపాల్ రెడ్డి నిద్రపోతున్నారా?

## మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ఆగ్రహం



**చండూరు, జూలై 26 (జనంసాక్షి)**
మునుగోడు నియోజకవర్గాన్ని ఎడారిగా మార్చే కుట్రలు జరుగుతుంటే స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఏం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఘాటుగా ప్రశ్నించారు. రాజగోపాల్ రెడ్డి నిర్లక్ష్య వైఖరి, స్వార్థ రాజకీయాల వల్లే మునుగోడు రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం చండూరు పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడారు.డిండి నీటి పంపకాల విషయంలో మునుగోడుకు దక్కాల్సిన వాటాను దారి మళ్లిస్తున్నారని ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. 436 అడుగుల వద్ద రెగ్యులేటర్ ఏర్పాటు చేయాల్సి ఉండగా, 440 అడుగుల వద్ద రెగ్యులేటర్ పెట్టి, 436 అడుగుల వద్ద మోటర్లు బిగించి పాలమూరు ప్రాంతానికి నీళ్లను తరలించుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదుల నుంచి డిండికి నీటిని ఇవ్వవద్దంటూ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఒత్తిడి తెస్తుంటే, రాజగోపాల్ రెడ్డి మాత్రం అడ్డుకోకుండా మౌనం వహిస్తున్నారని మండిపడ్డారు. ఉత్త మాటలు కట్టిపెట్టి, వెంటనే సీఎం వద్దకు వెళ్లి డిండి జలాలను మునుగోడుకు రప్పించాలని డిమాండ్ చేశారు.రాజగోపాల్ రెడ్డికి మునుగోడు అభివృద్ధి, తాగు-సాగునీటి సమస్యలపై పట్టింపు లేదని, కేవలం తన వ్యక్తిగత ఉనికి కాపాడుకోవడమే ధ్యేయంగా పనిచేస్తున్నారని విమర్శించారు. కూటిలో రాయి తీయలేనోడు ఏటిలో రాయి తీసినట్టు సొంత నియోజక వర్గాన్ని గాలికి వదిలేసి, తుంగతుర్తి, నకిరేకల్ వంటి ఇతర నియోజకవర్గాల్లో తిరుగుతూ ప్రకటనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ముందు తన నియోజకవర్గాన్ని చక్కదిద్దుకోవాలని హితవు పలికారు. ధనార్జనే ధ్యేయంగా, కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం పార్టీలు మారిన రాజగోపాల్ రెడ్డి, ఏనాడూ నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలను పట్టించుకోలేదని, తన వెంట వచ్చిన వారికే పదవులు కట్టబెట్టారని ఆరోపించారు.ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ తోకల వెంకన్న, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొత్తపాటి సతీష్, రాష్ట్ర నాయకుడు ఎత్తపు మధుసూదన్ రావు, నాయకులు బొడ్డు సతీష్ గౌడ్, ఉజ్జిని అనిల్ రావు, పెద్దగోని వెంకన్న గౌడ్, తేలుకుంట చంద్రశేఖర్, సామ యాదవ రెడ్డి, నకరికంటి రాములింగం, మహమ్మద్ గౌస్, ఇడికూడా శ్రీను, రాపోలు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ భృతి కల్పించి ఆదాయ వనరులు పెంచాలి










○స్థానిక పరిశ్రమల్లో స్థానికేతరులదే పై చెయ్..అన్ని రంగాల్లో.. అంతటా వారే.!

○లోకల్ వారి ఉపాధిని పట్టించుకోని యాజమాన్యాలు. ప్రజా ప్రతినిధులు

○పని వారికి పరిశ్రమ వ్యర్థాలు మాకా? నిలదీస్తున్న తెలంగాణ నిరుద్యోగ యువత

**మణుగూరు, జూలై 26 (జనంసాక్షి):**
మా బతుకులు మారుతాయి. మా బిడ్డలకు ఉద్యోగాలు వస్తాయని ఎన్నో ఏళ్ల పాటు కొట్లాడి ఎంతోమంది ప్రాణ త్యాగాలు చేసి తెచ్చుకున్న తెలంగాణ స్వరాష్ట్రంలో గతం కంటే ఇప్పుడే దౌర్భాగ్యస్థితిలో బతుకుతున్నారు. తెలంగాణ తెచ్చుకుంది మన బతుకులు మారుతాయనీ కానీ ఇతర రాష్ట్రాల బతుకుల బాగుచేయడం కోసమే అని ఇప్పుడు తెలిసింది.అన్ని వనరులుండి అడుక్కోవాల్సిన పరిస్థితి వచ్చింది.. స్థానికులు నేడు స్థానికేతరలవుతున్నారు..! స్థానికంగా నెలకొల్పబడిన వివిధ రకాల పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు దొరక్క అవస్థలు పడుతున్నారు. తెలంగాణ వాసి అని తెలిస్తే చాలు తమకు మొహం మీదనే జాబు ఇవ్వమంటూ తెగేసి చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నైపుణ్యం ఉన్నా లేకున్నా తెలంగాణవాసికి పని చేతకాదు అన్న ముద్ర వేసేస్తున్నారని మండిపడుతున్నారు. స్థానికుల కంటే ఇతర రాష్ట్రాల కార్మికులకే అధిక ప్రాధాన్యత ఇస్తూ తమను చులకనగా చూస్తున్నారని వాపోతున్నారు. అందరూ పని చేస్తేనే ఆ రాష్ట్రం ఆర్థికంగా వృద్ధి చెందుతుంది స్థానికేతరులు పనిచేస్తే వాళ్ళ రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. మన రాష్ట్రం పరిస్థితి ఏమిటో.? యాజమాన్యాలు, ప్రజా ప్రతినిధులు ఆలోచించాలి...

**అన్ని రంగాల్లో.. ఇంటా బయట అంతటవారే..!**

**అన్ని రంగాలలో అన్ని ప్రాంతాలలో చాప కింద నీరులా**

**కార్మికులు చొరబడ్డారు.**

పరిశ్రమలతో పాటు వివిధ రకాల వ్యాపార వాణిజ్య సముదాయాల్లో, వ్యవసాయ పనిముట్లలో, ఇటుక బట్టీల వ్యాపారంలో చివరికి పాలను పితికే జీతకాడు కూడా ఇతర రాష్ట్రాలకు చెందిన వారే దర్శనమిస్తున్నారు. ఆడా ఈడ ఇంట బయట అంతా నాన్ లోకల్ కార్మికులే కనిపిస్తున్నారు. పరిశ్రమలు, వ్యాపార వర్గాల్లో ఉన్న వ్యాపారులు కూడా తెలంగాణ యువత పనితనాన్ని ఇతర కార్మికుల పనితనాన్ని సరిపోల్చుకుంటున్నారు. స్థానిక యువతకు పనిచేయడం చేతకాదని, సమయం వృధా చేస్తారని, చేయాల్సిన పని అంత త్వరగా పూర్తి చేయరని, పైగా విశ్రాంతి తీసుకునే ధోరణి, ప్రశ్నించడం, నిరసనలకు దిగడం, ఆందోళనలు చేయడం తదితర వాటికి భయపడే తక్కువ జీతానికి, తక్కువ వేతనానికి ఎక్కువ శ్రమ చేసే ఇతర రాష్ట్రాల కార్మికులను తీసుకురావాల్సి వస్తుందని పలువురు వ్యాపారులు పేర్కొంటున్నారు. వాళ్లకు అర్హత ఉండదు జీతం తక్కువ మనకు అర్హత ఎక్కువ జీతం తక్కువ వాళ్లకు ఎలాంటి ఇంటర్వ్యూలు ఉండవు మనకు అన్ని రకాల ఇంటర్వ్యూలు ఉంటాయి.మరి ప్రశ్నించారా.

**పనివారికి.. పరిశ్రమ వ్యర్థాలు**

**మాకా..?:**
స్థానికంగా భూములు కోల్పోయి వాయు శబ్ద కాలుష్యానికి తట్టుకుని మా వాడే అని పరిశ్రమలు నెలకొల్పడానికి సహకరిస్తే అందులో ఉపాధి చేసే కార్మికులు మాత్రం స్థానికేతరులు 80 నుంచి 90 శాతం పని చేస్తున్నారని వాపోతున్నారు. కానీ పరిశ్రమలు విడుదల చేసే కర్బన ఉద్గారాలతో పాటు వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యం, జల కాలుష్యం మాత్రం మాకు వదులుతున్నారని మండిపడుతున్నారు. పరిశ్రమల ఏర్పాటు వల్ల స్థానికులకు అనేక రకాలుగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ముఖ్యంగా పరిసర ప్రాంతాల్లో ఉన్న రైతన్నలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందంటున్నారు. భూగర్భజల కలుషితం కావడంతో పాటు పంటల దిగుబడి తగ్గిపోవడం, వ్యర్థాల వల్ల సాగునీరు తాగునీరు కలుషితం అవడం, ప్రజలు, పశువులు సేవించి మృత్యువాత పడడం జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనేక రకాల చర్మవ్యాధులు గుండె సంబంధిత అనారోగ్య సమస్యలకు గురవుతున్నామని బాధపడుతున్నారు. అనారోగ్యాలు మాకు ఆదాయ వనరులు వాళ్ళకి ఎత్తుపోతుంది సమాజం..అర్థం చేసుకో వాల్సిన మందరిపై ఉంది..

**పార్టీలు, నాయకులకూ పట్టింపు లేదు:**
పరిశ్రమల్లో స్థానిక వాసులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో పార్టీల నాయకులు విఫలమవుతున్నారని, వారి మాటకు కూడా విలువ ఇవ్వడం లేదని పలువురు నిరుద్యోగ యువకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం రాజకీయ లబ్ది కోసమే తమను అప్పటి పూర్తిగా పావుగా వాడుకుంటున్నారని, తమకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగినప్పటికీ ఎవ్వరు కూడా కనికరించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీల నాయకులతో పరిశ్రమ యాజమాన్యాలతో పైరవీలు చేయించినప్పటికీ చిన్నాచితక ఉద్యోగంలో ఉపాధి కల్పిస్తూ చిన్న చూపుగా చూస్తున్నారని, స్థానిక పరిశ్రమల్లో స్థానికేతరులుగా పని చేయాల్సిన కర్మ దాపురించిందని మండిపడుతున్నారు. చాలీచాలని జీతాలతో తమ జీవితాలను నెట్టుకురాలేకపోతున్నామని దిగాలు చెందుతున్నారు.

**మారాల్సింది ఎవరు..?**

**మారాల్సింది ఎవరు రాజకీయ నాయకుల పరిశ్రమల**

**యాజమాన్యాల**

నైపుణ్యం ఉండి అన్ని రకాల అనుభవం, అర్హతలు కలిగిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత స్థానిక పరిశ్రమల యాజమాన్యాలు ప్రజాప్రతినిధులతో పాటు ప్రతి ఒక్కరిపై ఉంటుంది. ప్రాంతీయ విభేదాలు పక్కన పెట్టి పని చేసే వారికి, అంకిత భావం గల ఆశావాహులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. ఇవేవీ పట్టించుకోకుండా కొన్ని పరిశ్రమ యాజమాన్యాలు మాత్రం తెలంగాణ వాసి అన్న సాకుతో చిన్న చూపుగా చూడడం తగదు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన తెలంగాణ పల్లె జనాలు ప్రశ్నించడం, నిలదీయడం, ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడడం అలవాటైపోయింది. తెలంగాణ వ్యక్తిత్వాన్ని కొందరు అపార్థం చేసుకుని అహంకారమనుకోవడం మూర్ఖత్వం అవుతుంది. తెలంగాణ ఉనికిని, తెలంగాణ నైసర్గిక స్వరూపాన్ని, సంస్కృతి సాంప్రదాయాలను అర్థం చేసుకుని అందరిని కలుపుకొని ముందుకు పోయే ధోరణి ఉండాలి. లేకుంటే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించినట్లుగానే తెలంగాణ ఉనికి, ఉద్యోగాల కోసం మరొక ఉద్యమం ఎగిసి పడే అవకాశం లేకపోలేదు.!

**యువత మేల్కొనాలి:**
ఇది ఇలానే కొనసాగితే ఏడాదికి ఏడాది డిగ్రీ పట్టాలు పుచ్చుకొని ఏ ఉద్యోగం లేక నిరుద్యోగుల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతోంది. లక్షలకు లక్షలు ఖర్చుపెట్టి సాంకేతిక విద్య చదివించే తల్లిదండ్రులకు పరిస్థితి ఏమిటి..? అప్పులు తీరేదెలా కొడుకు ప్రయోజకుడు అయ్యేదెలా..? మాబతుకులు మారతాయని అనుకుంటే వాళ్ళు బతికేది కష్టంగా ఉందని తల్లి తండ్రులు ఆవేదన చెందుతున్నారు. వయస్సు పెరిగి ఉద్యోగం లేక ఉండటానికి ఇల్లు తినటానికి తిండి లేని పరిస్థితి తెలంగాణ ప్రాంతంలో రాబోతుంది. ఇప్పుడు మేల్కొనకపోతే భవిష్యత్తు అందకారంలోకి వెళ్తోంది.

## ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ నూతన కమిటీ ఎన్నిక

### అధ్యక్షుడిగా బిట్ల చంద్రశేఖర్



**భూదాన్ పోచంపల్లి, జూలై 26 (జనంసాక్షి):**
పురపాలక కేంద్రంలోని 9వ వార్డు మార్కం డేయ నగర్ కాలనీలో గల ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా 9వ వార్డు కౌన్సిలర్ జింకల లావణ్య యాదగిరి హాజరై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడిగా బిట్ల చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా సుంకి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కాముని సత్యనారాయణ, సహాయ కార్యదర్శులుగా అనబత్తుల లింగం, చిటుకుల నరేష్, కోశాధికారిగా రేగోటి రాజు, కార్యవర్గ సభ్యులుగా గుర్రం వెంకటేష్, సుంకి రాజు, దేవర కాశి, గుండేటి రవిశంకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు కౌన్సిలర్ జింకల లావణ్య యాదగిరి అభినందనలు తెలియజేసి, దేవాలయ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూరపాటి బాబు, బిట్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకే ప్రత్యేక తనిఖీలు : కోదాడ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి



**కోదాడ( జనం సాక్షి):**
కోదాడ పట్టణంలోని బాలాజీ నగర్‌లో ఆదివారం పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేశారు.. కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, పట్టణ సీఐ శివశంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 25 మోటార్ బైకులు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో కోదాడ సబ్‌డివిజన్ పరిధిలోని ఇద్దరు సీఐలు, ఎనిమిది మంది ఎస్ఐలు, 80 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అనంతరండీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టినట్లుగా తెలిపారు. గంజాయి, మాదకద్రవ్యాలు, అసాంఘిక శక్తుల కార్యకలాపాలు, నేరాల నియంత్రణే ఈ ప్రత్యేక తనిఖీల ప్రధాన ఉద్దేశమని అన్నారు.. కొత్త వ్యక్తులకు గుర్తింపు పత్రాలు లేకుండా ఇళ్లను అద్దెకు ఇవ్వొద్దని, వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా అక్రమ కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే డయల్ 100, 112 లేదా సైబర్ హెల్ప్‌లైన్ 1930కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# కాలం తెచ్చింది కాదు...కాంగ్రెస్ తెచ్చిన కరువు




- కాలంకాక రైతులంతా నీళ్ల కోసం ఎదురుచూస్తున్నారు
- వెంటనే కన్నెపల్లి పంప్ హౌస్ ను ప్రారంభించి రైతులకు నీళ్లు అందించాలి
- బుల్లెట్ ట్రైన్ ను పాత పద్ధతిలోనే అనుకున్న మార్గంలో వచ్చేలా సహకరించాలి
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి

సూర్యాపేట(జనంసాక్షి): రాష్ట్రంలో నెలకొన్న ఈ కరువు కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తెచ్చిన కరువేనని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం తలెత్తుతున్న నీళ్లు, కరెంటు సమస్యలపై సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గోదావరిలో నీళ్లన్నీ పోతున్నాయి కానీ సూర్యాపేటకు నీళ్లు రావడం లేదన్నారు. కాలంకాక రైతులంతా నీళ్ల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. కేసీఆర్ హయాంలో వచ్చిన నీళ్లు ఇప్పుడు ఎందుకు రావడం లేదని ప్రశ్నిస్తున్నారని అన్నారు. కాళేశ్వరం, కన్నెపల్లి నుంచి ఇక్కడి వరకు అన్నీ వ్యవస్థలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పటికీ లక్ష క్యూసెక్కులు నీరు వృథాగా పోతుంటే ప్రభుత్వం ఇంకా నిద్రావస్థలోనే ఉందని విమర్శించారు. ప్రభుత్వపు నిర్లక్ష్యపు ధోరణి, పట్టుదలతో పంటలను ఎండబెడుతున్నారని అన్నారు. కోట్లాది మంది ప్రజల ప్రాణాలతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చెలగాటమాడుతుందని తెలిపారు. కేసీఆర్ హయాంలో వరుసగా తొమ్మిది పంటలకు నీళ్లు ఇచ్చామని, ఇప్పుడు ఒక్క పంటకు నీళ్లివ్వలేని దుస్థితి నెలకొందన్నారు. కాంగ్రెస్ పాలకుల అనుభవం లేని తనం, బాధ్యత రాహిత్యం స్పష్టంగా కనబడుతుందన్నారు. వెంటనే కన్నెపల్లి పంప్ హౌస్ ను ప్రారంభించి రైతులకు నీళ్లు అందించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సరఫరా లో తీవ్రమైన అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. 2014 ముందున్న పరిస్థితులే పునరావృతం అవుతున్నాయని పేర్కొన్నారు. ఎక్కడ చూసినా బోరింగ్ రిగ్గులు కనబడుతున్నాయని, మళ్లీ వాటికి గిరాకి పెరిగిందని, రైతులు అప్పుల పాలవుతున్నారని అన్నారు. కేవలం కరెంట్ బిల్లులు కట్టడం ఇష్టం లేకనే నీళ్లు, కరెంటు ఇవ్వడం లేదన్నారు. కొనడానికి ఖర్చవుతుందన్న నిర్లక్ష్యంతోనే 24 గంటలు కరెంటు బంద్ పెట్టారని ఆరోపించారు. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే ప్రభుత్వంపై రైతుల తిరుగుబాటు తప్పదన్నారు. కచ్చితంగా ఆ తిరుగుబాటు సూర్యాపేట నుంచే ప్రారంభమవుతుందని అన్నారు. బుల్లెట్ ట్రైన్ పై ఈ ప్రాంత ప్రజలు ఎంతో ఆశలు పెట్టుకున్నారని, బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ పై ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజల్లో ఆందోళన కలుగుతుందన్నారు. శంషాబాద్ నుంచి నల్లగొండ, సూర్యాపేట జిల్లాల మీదుగా చెన్నై వరకు బుల్లెట్ ట్రైన్ ప్రతిపాదన చేశారన్నారు. గతంలో ఎన్నోసార్లు ఇదే పద్ధతిలో చెబితే, ఈ ప్రాంత ప్రజలంతా ఆశలు పెట్టుకున్నారని తెలిపారు. ఎంతో అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతానికి బుల్లెట్ ట్రైన్ అవసరం ఎంతో ఉందన్నారు. పాత అలైన్మెంట్ మార్చి వేరే వైపు నుండి ప్రయత్నం చేస్తున్నారనే విషయం తీవ్ర ఆందోళన కలిగిస్తుందన్నారు. ఈ విషయంపై ప్రభుత్వాలు వెంటనే పునరాలోచన చేయాలని కోరారు. ఇక్కడున్న బిజెపి, కాంగ్రెస్ నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఒప్పించాలన్నారు. బుల్లెట్ ట్రైన్ ను పాత పద్ధతిలోనే అనుకున్న మార్గంలో వచ్చేలా సహకరించాలన్నారు. దీనిపై తమ వంతు సహకారం కూడా తప్పకుండా అందజేస్తామని తెలిపారు.



## ఇందిరానగర్ ఎల్లమ్మ దేవాలయ నూతన కమిటీ ఎన్నిక

## చైర్మన్‌గా నల్ల చిన్న మల్లయ్య

భూదాన్ పోచంపల్లి, జూలై 26 (జనంసాక్షి): మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డు ఇందిరానగర్ కాలనీలోని శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ నూతన కమిటీని ఆదివారం మాజీ చైర్మన్లు, కాలనీ పెద్దల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయ నూతన చైర్మన్‌గా నల్ల చిన్న మల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకోగా, ఉపాధ్యక్షుడిగా గుర్రు దానయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎర్ర బిక్షపతి ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా పోతగళ్ల నరహరి, పోతగళ్ల రాజు, కరగళ్ల రాములు, కుక్క బాలరాజ్, నల్ల శ్రీను, పెద్దల బాలయ్య, చెరుకు వెంకటేశం, కొమ్ము ఉషయ్య, ఎడ్ల లింగస్వామి, ఒరుగంటి రాకేష్, మూటపురం రవి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బహుజన ప్రజాశక్తి రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మణ్, మాజీ చైర్మన్లు పెద్దల నరసింహ, కుక్క మారయ్య, పెద్దల యాదయ్య, పోతగళ్ల బాలరాజ్, కరగళ్ల కుమార్, చెరుకు నరసింహ, నాలుగో వార్డు కౌన్సిలర్ పెద్దల చక్రపాణి, కాంగ్రెస్ పార్టీ నాలుగో వార్డు ఇంచార్జ్ నల్ల నాగేష్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పెద్దల సుధాకర్, మాజీ అధ్యక్షులు పోతగళ్ల లింగస్వామి, ఎర్ర శంకర్, పోతగళ్ల శ్రీనివాస్, పోతగళ్ల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## బోల్తా పడిన కారులో మంటలు..

## తృటిలో తప్పిన ప్రాణాపాయం

కోదాడ,( జనం సాక్షి) కోదాడ సమీపంలోని విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై మద్రాస్ కేఫ్ సమీపంలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి బోల్తా పడడంతో ఇంజిన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికులు, ఇతర వాహనదారులు వెంటనే స్పందించి కారులో చిక్కుకున్న వారిని బయటకు తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా, మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు, 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రమాదం కారణంగా కొద్దిసేపు జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా, పోలీసులు వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. విజయవాడ నుంచి యాదగిరిగుట్టకు దైవదర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



### జాతీయ ఉత్తమ సర్పంచ్ అవార్డుతో

## రాంరెడ్డిపల్లికి జాతీయ గుర్తింపు

### సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న సర్పంచ్ లపంగి నర్సింహా





మర్రిగూడ, జూలై 26(జనం సాక్షి) బహుజన సాహితీ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో రాంరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్, ఉమ్మడి నల్లగొండ జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లపంగి నర్సింహాకు "జాతీయ ఉత్తమ సర్పంచ్ అవార్డు?2026" ప్రదానం చేశారు. బహుజన సాహితీ అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ ఆధ్వర్యంలో ప్రకటించిన ఈ అవార్డును తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా లపంగి నర్సింహా అందుకున్నారు. గ్రామాభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల సమర్థ అమలు, ఆదర్శ గ్రామ నిర్మాణంలో చేసిన విశిష్ట సేవలను గుర్తిస్తూ ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లపంగి నర్సింహా మాట్లాడుతూ, "ఈ అవార్డు వ్యక్తిగతంగా నాకు దక్కిన గౌరవం కాదు. రాంరెడ్డిపల్లి గ్రామ ప్రజల విశ్వాసానికి, గ్రామాభివృద్ధికి దక్కిన గుర్తింపు. గ్రామ ప్రజలు, పంచాయతీ సభ్యులు, అధికారులు, కుటుంబ సభ్యులు అందించిన సహకారంతోనే ఈ స్థాయికి చేరుకున్నాను. ఈ గౌరవం నాకు మరింత బాధ్యతను పెంచింది. ప్రజల ఆశయాలకు అనుగుణంగా గ్రామాభివృద్ధి కోసం మరింత అంకిత భావంతో పనిచేస్తాను" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, సామాజికవేత్తలు లపంగి నర్సింహాను అభినందిస్తూ, ఈ అవార్డు రాంరెడ్డిపల్లి గ్రామానికి, ఉమ్మడి నల్లగొండ జిల్లాకు గర్వకారణమని కొనియాడారు.

## అక్రమ మైనింగ్‌పై కలెక్టరేట్ ముట్టడికి గోర్ బంజారా పోరాట సమితి మద్దతు

చండ్రుగొండ, జూలై 26 (జనం సాక్షి): తోగూడెం గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతున్న అక్రమ మైనింగ్‌పై ప్రభుత్వం, అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి బోడ రవి నాయక్ డిమాండ్ చేశారు. చండ్రుగొండలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అక్రమ మైనింగ్ వల్ల ప్రభుత్వానికి ఆదాయ నష్టం, ప్రకృతి సంపదకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. అక్రమాలకు పాల్పడిన వారితో పాటు సహకరించిన అధికారులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమ మైనింగ్ నిర్మూలన కోసం సేవాలాల్ సేన ఈ నెల 27న భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ (ఐడీఓసీ) వద్ద చేపట్టనున్న ముట్టడి కార్యక్రమానికి భారతీయ గోర్ బంజారా పోరాట సమితి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొంటారని పేర్కొంటూ, ప్రజాసంఘాలు, గిరిజన సంఘాలు, రైతు, యువజన సంఘాలు ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

## పిల్లలమర్రి దేవాలయాల సందర్శన



సూర్యాపేట(జనంసాక్షి): ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ కేంద్ర కమిటీ సభ్యులు మణికొండ వేదకుమార్ ఆదివారం నల్లగొండ జిల్లా సభ్యులు పెద్దిరెడ్డి గణేష్ తో కలిసి సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలోని పిల్లలమర్రి దేవాలయాలను సందర్శించారు. పిల్లలమర్రి గ్రామంలోని దాదాపు వెయ్యి సంవత్సరాల పురాతన దేవాలయాలు ఎరుకేశ్వర ఆలయం, త్రికూటేశ్వర ఆలయాలు అక్కడ ఉన్న చారిత్రిక ఆనవాళ్లు శాసనాలను పరిశీలించారు. జిల్లా సభ్యులు పెద్దిరెడ్డి గణేష్ అందించిన చరిత్ర వివరాలను అక్కడున్న శిల్ప సంపదతో సరిపోల్చి ముగ్ధులయ్యారు. త్వరలో పిల్లలమర్రి దేవాలయాల గురించి ఒక డాక్యుమెంటరీ ఫిల్మ్ నిర్మించి ఢిల్లీ సంస్థకు అందిస్తానని అన్నారు. తద్వారా కేంద్ర, రాష్ట్ర ఆర్కియాలజీ డిపార్ట్మెంట్ ద్వారా నిధులు సాధించి ఇటువంటి గొప్ప జాతీయ సంపదలను కాపాడి ముందు తరాలకు అందించవచ్చని చెప్పారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలోని సుధా బ్యాంక్ వద్ద వేదకుమార్ కి ఇంటాక్ సభ్యులు భోనగిరి భాస్కర్, ధనుంజయ తదితరులు ఘన స్వాగతం పలికారు.

## యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



సూర్యాపేట (జనంసాక్షి): నిత్యజీవితంలో ప్రతి మనిషి యోగా అలవర్చుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని సూర్యాపేట ఉన్నత యోగా శిక్షణ కేంద్రం నిర్వాహకులు, యోగా గురూజీ చాడపాపిరెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో సూర్యాపేట ఉన్నత యోగా శిక్షణ కేంద్ర కార్యాలయంలో 12వ వార్షికోత్సవ వేడుకలతో పాటు, గురుపూజోత్సవంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 12 ఏళ్ల క్రితం సూర్యాపేటలో సూర్యాపేట ఉన్నత యోగా శిక్షణ కేంద్రం ఏర్పాటుచేసి ఎంతో మందికి యోగా నేర్పి ఆరోగ్యవంతులుగా చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సంత్ నిరంకార్ సంస్థ నిర్వాహకురాలు కదారి సరళ, వి.లింగయ్య, మల్లారెడ్డి, ముప్పారపు నాగేశ్వరరావు, గుండా రమేష్, నేతకాని వెంకన్న, సుధాకర్, సుదర్శన్ రెడ్డి, బాణాల శ్రీనివాస్, మమత, ధనలక్ష్మి, జయలక్ష్మి, శ్రీదేవి, దివ్య మంజుల, గోరంట్ల శ్రీనివాస్, రవికుమార్, బాణాల శ్రీనివాసచారి , శ్రీధర్, శైలజ, పాల్వాయి పద్మ, రజిత, సుజాత, మురళీకృష్ణ, వాసవి, పద్మ, శ్రీలత, సంధ్య, శేషాచారి, రాజు తదితరులు పాల్గొన్నారు.



## చెస్ పోటీలతో విద్యార్థుల్లో మేథాశక్తి పెంపొందుతుంది

**సూర్యాపేట(జనంసాక్షి):**
చెస్ పోటీలతో విద్యార్థుల్లో మేథాశక్తి పెంపొందుతుందని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గండూరి కృపాకర్, ఎల్.సతీష్ కుమార్ అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని టీటీడీ కళ్యాణ మండపంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి అండర్ -13,17 విభాగంలో బాల,బాలికలకు నిర్వహించిన చెస్ పోటీలలో విజేతలకు బహుమతులను అందజేసి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్ కు దూరంగా ఉంటూ క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని అన్నారు.అనంతరం విజేతలకు సర్టిఫికెట్స్, షీల్డ్ లు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ సభ్యులు కాశీమ్, రాజీవ్, కొండ నర్సింహారావు, అమర్ నాథ్ తదితరులు పాల్గొన్నారు.



## పరిమితికి మించి వైద్యం చేయరాదు

**మండల గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు ఎరుకల శ్రీశైలం గౌడ్**

**మునగాల, జూలై 26(జనంసాక్షి):**
మండల కేంద్రంలోని ది మునగాల పబ్లిక్ స్కూల్ ఆవరణంలో రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ మునగాల మండలం కమిటీ సంఘం వారి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గ్రామీణ వైద్యుల కమిటీ సమావేశంలో మునగాల మండల గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు ఎరుకల శ్రీశైలం గౌడ్ పాల్గొని గ్రామీణ వైద్యులకు సలహాలు సూచనలు అందించి మాట్లాడారు. పరిమితికి మించి వైద్యం చేయకూడదని రోగులకు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని అన్నారు. రాబోయే సీజన్ వ్యాధులను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని అర్ధాంతరంగా ఆగిపోయిన పారామెడికల్ ట్రైనింగు క్లాసులు మొదలుపెట్టి సర్టిఫికెట్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. మునగాల మండలంలోని ఇబ్బందులలో ఉన్న ఆర్.ఎం.పి, పి.ఎం.పీ.లకు సంఘం తరఫున వారిని ఆదుకుంటూ వచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దొంతగాని రవి, ఎస్ పి. వెంకటప్పయ్య , ఉపేంద్రచారి, వెలుగోరి అనిల్ కుమార్, ఆదినారాయణ, నరసింహారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మండవ శ్రీనివాస్ గౌడ్, నరసింహుల గూడెం జానీ పాషా, నారాయణగూడెం అనిల్, వివిధ మండలంలోని గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా విద్యార్థుల ఉద్యమ విజయమే : నల్లమోతు వెంకట రమణ

**చంద్రుగొండ, జూలై 26( జనంసాక్షి):**



కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత చేపట్టిన ఉద్యమానికి దక్కిన చారిత్రక విజయమని చంద్రుగొండ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్లమోతు వెంకట రమణ అన్నారు. న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడిన విద్యార్థుల ధైర్యసాహసాలను ఆయన అభినందించారు. విద్యార్థుల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో అవసరమైన సంస్కరణలు చేపట్టాలని కోరారు. యువతకు అండగా నిలిచిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



## కొండాపూర్ సర్పంచ్ కొప్పుల వెంకట్ రెడ్డికి ‘ఉత్తమ సర్పంచ్ జాతీయ అవార్డు’

**○బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రదానం**

**○హైదరాబాద్‌లో ఘనంగా జరిగిన 19వ జాతీయ సదస్సు**

**○హర్షం వ్యక్తం చేస్తున్న యాదాద్రి భువనగిరి జిల్లా నాయకులు, గ్రామస్తులు**

**మోటకొండూరు, జూలై 26(జనం సాక్షి):**
సామాజిక సేవ, గ్రామాభివృద్ధిలో విశేష కృషి చేసిన యాదాద్రి భువనగిరి జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, మోటకొండూరు మండల కొండాపూర్ గ్రామ సర్పంచ్ కొప్పుల వెంకట్ రెడ్డి అరుదైన ఘనత సాధించారు. ఆయన సేవలను గుర్తించిన ‘బహుజన సాహిత్య అకాడమీ ఆయనను ప్రతిష్టాత్మక ఉత్తమ సర్పంచ్ జాతీయ అవార్డు ? 2026’ తో ఘనంగా సత్కరించింది.ఆదివారం (జూలై 26న) హైదరాబాద్‌లో బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ‘బహుజన రచయితల 19వ జాతీయ సదస్సు’ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ యు. సుబ్రహ్మణ్యన్ తదితరుల చేతుల మీదుగా కొప్పుల వెంకట్ రెడ్డి ఈ జాతీయ అవార్డును, ధృవీకరణ పత్రాన్ని (సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్) అందుకున్నారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి, గ్రామ అభివృద్ధికి వెంకట్ రెడ్డి అంకితభావంతో చేస్తున్న నిరంతర కృషికి దక్కిన గుర్తింపు ఇది అని నిర్వాహకులు ఈ సందర్భంగా కొనియాడారు. జాతీయ స్థాయిలో ఉత్తమ సర్పంచ్ అవార్డును దక్కించుకున్న కొప్పుల వెంకట్ రెడ్డికి పలువురు ప్రజాప్రతినిధులు, జిల్లా నాయకులు, కొండాపూర్ గ్రామస్తులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

## జిల్లా గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ ఎన్నిక

**ఖమ్మం కార్పొరేషన్, జూలై 26 (జనంసాక్షి):** తెలంగాణ గవర్నమెంట్ కళాశాల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా ఎన్నికలు స్థానిక ప్రభుత్వ కళాశాలలో నిర్వహించారు, ఎన్నికలలో డా కే సురేందర్ రెడ్డి ప్యానెల్ తరుపున అధ్యక్షులు డా. పి విజయ్ కుమార్, కార్యదర్శి సూరంపల్లి రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. కోశాధి కారి డా. ఎస్ శ్యామలాదేవి, ఉపాధ్యక్షులుగా డా. కుక్కల కార్తీక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు, ఈ ఎన్నికలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్‌గోపి, మాజీ జిల్లా అధ్యక్షులు డా.ఎన్ మాధవ రావు హాజరైనారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు డా. ఎన్ గోపి మాట్లాడుతూ డా. కే సురేందర్ రెడ్డి నాయకత్వంలో కళాశాల అధ్యాపకుల సమస్యలు పరిష్కారం అయ్యాయని ప్రభుత్వ సహకారంతో జీవో నెంబర్ 21 ద్వారా జూనియర్ కళాశాల సర్వీస్ ను పరిగణలోకి తీసుకొని కెరియర్ అడ్వాన్స్మెంట్ స్కీమ్ కి లబ్ధి పొందేలా సురేందర్ రెడ్డి కృషి చేశారని, క్యాడర్ కు సంబంధించిన అనేక అంశాల పరిష్కారానికి కృషి చేసిన ఈ నాయకత్వాన్ని ఎన్ను కోవటం అభినంద నీయమని తెలియజేశారు. డా. ఎన్ మాధవరావు మాట్లాడుతూ నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గం అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర నాయకత్వంతో కలిసి పని చేస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఆగస్టు 2వ తారీఖు జరిగే రాష్ట్ర ఎన్నికలలో సురేందర్ రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ ఏకా భిప్రాయం గా తీర్మానించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ఎన్నికల అధికారిగా డి రమేష్ వ్యవహరించారు, ఈ కార్యక్రమంలో డా. కే కిరణ్ కుమార్, డా.పానుగోటి రవికుమార్, డా.వి బ్రహ్మం, డా. బూరుగు శ్రీనివాస్, డా. డిసుజాత, డా.ఐకిరణ్ కుమార్, పి శ్రీనివాస్, డా.ఎస్ బాబు, డా.పూర్ణచందర్రావు, డా. శ్యాం ప్రసాద్, డా. శ్రీనివాస్ కుమార్, సిహెచ్ మల్లేశం, డా డి అరుణ, డా . శ్రీరామ్ రాకేష్, కే.రవికుమార్, డా. సిహెచ్ శ్రీనివాస్, డా. గంటయ్య గుప్తా, డా. సర్వేశ్వరరావు,సుజిత్ రెడ్డి,బి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో అంతా ఒక్కటే.. పార్టీ బలోపేతమే ధ్యేయం

**తుంగతుర్తి నియోజకవర్గంలో ఎలాంటి వర్గ భేదాలు లేవని బూతు స్థాయి నుండి కాంగ్రెస్ పార్టీ బలోపేతమే మా ముఖ్య ఎజెండా!**

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి**

**నూతనకల్ జూలై26 ( జనంసాక్షి)**
తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి వర్గ బేధాలు లేవని, బూత్ స్థాయి నుండి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే మా ముఖ్య ఏజెండాని నూతనకల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం విలేకరుల సమక్షంలో మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ ఆధ్వర్యంలో తుంగతుర్తి నియోజకవర్గం అభివృద్ధిలో ముందుకు వెళు తుందని, జరిగిన ఈ రెండున్నర సంవత్సరాలలో 40 కోట్ల నిధులతో మన మండలాన్ని అభివృద్ధి పథం లో ఉంచారు అని గత పది సంవత్సరాలుగా ఈ నియోజకవర్గం ఏటువంటి అభివృద్ధి కార్యక్రమాలకు నోచుకోలేదు అని మన ఎమ్మెల్యే మందుల శామ్యూల్ ఎన్నికైనప్పటి నుండి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుంటూ తుంగతుర్తి నియోజకవర్గాన్ని ముందంజలో ఉంచుతున్నారు. ఇది గిట్టని కొంత మంది విమర్శకులు విమర్శలు చేస్తున్నారు. మందులు సామెల్ తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన వ్యక్తి అని నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉండడం ఈ రెండు తోడై సామేల్ ఈ నియోజకవర్గంలో 52 వేల మెజారిటీతో ఘన విజయం సాధించడం జరిగిందని గుర్తు చేశారు.తుంగతుర్తి నియోజకవర్గంలో ఎటువంటి వర్గాలు లేవు చిన్నచిన్న సమస్యలు ఏమైనా ఉన్నప్పటికీని అది పార్టీ అధిష్టానం చూసుకుంటుంది అని మల్లారెడ్డి అన్నారు. మన కాంగ్రెస్ పార్టీ నాయకులంతా ఒకటిగా పోరాడి మన తుంగతుర్తి నియోజకవర్గం అభివృద్ధి పథంలో ఉంచుకుందాం అని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు అనంతుల శ్రీనివాస్ గౌడ్,దీప శంకర్ నాయక్,జ్యోతి సుధాకర్,నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడు పాల్వాయి నాగరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గోరుగంటి రామకిషన్ రావు,దరిపెల్లి వీరన్న, సైరెడ్డి రెడ్డి సుధీర్ రెడ్డి, చురకంటి చంద్రారెడ్డి,కృష్ణ ప్రశాంత్, అంబెడ్కర్, నాగమల్లు, ఇరుగు కిరణ్, అశోక్,బంటు బద్రి, క్రాంతి,శ్రీకాంత్, మధు,వీరబాబు నవీన్,కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా కార్గిల్ విజయ్ దివస్ నిర్వహణ

**ఖమ్మం కార్పొరేషన్, జూలై 26 (జనంసాక్షి)**
కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ఖమ్మంలోని ఫ్రీడమ్ పార్క్‌లో దేశభక్తి వాతావరణంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమర జవాన్లకు ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమానికి ఎస్పీ ఇంటెలిజెన్స్ రామోగి రమేష్ , సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ చంద్రశేఖర్ , మిసెస్ ఇండియా ఫస్ట్ రన్నరప్, ఫిట్ ఇండియా అంబాసడర్ ఎం. ఫర్వా , మాజీ సైనిక ఉద్యోగుల సంఘం ప్రతినిధి అరుణ్ కుమార్ , విద్యావేత్త సాంబశివరెడ్డి , తెలంగాణ ఎక్స్-సర్వీస్‌మెన్ లీగల్ వింగ్ అధ్యక్షులు, అలాగే పలువురు ప్రముఖులు, మాజీ సైనికులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రముఖులందరూ మాట్లాడుతూ, కార్గిల్ యుద్ధంలో ప్రాణత్యాగం చేసిన అమర వీరుల త్యాగం భారతదేశ చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించిన సైనికుల సేవలను ప్రతి భారతీయుడు గౌరవించాలని, వారి త్యాగస్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.నేటి యువత మాదకద్రవ్యాల వ్యసనం, పెరుగుతున్న నేరాలు వంటి సామాజిక సమస్యలకు దూరంగా ఉండాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషిస్తుందని, క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావంతో ముందుకు సాగాలని తెలిపారు.కార్గిల్ విజయ్ దివస్‌ను ప్రతి సంవత్సరం జరుపుకోవడం మాత్రమే కాకుండా, అమర జవాన్ల త్యాగాలను ప్రతి రోజూ స్మరించుకుంటూ దేశం పట్ల బాధ్యతతో జీవించడం నిజమైన నివాళి అని ప్రముఖులు పేర్కొన్నారు.కార్యక్రమం ముగింపులో



కార్గిల్ అమరవీరులకు పుష్పాంజలి ఘటించి, దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధి కోసం ప్రతి పౌరుడు తన వంతు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

# విద్యార్థుల సమరం గెలిచింది : ముహమ్మద్ ముజాహిద్

**ఖమ్మం కార్పొరేషన్, జూలై 26 (జనంసాక్షి):** అపారమైన ఆశలతో, చెరగని పట్టుదలతో పోరాట క్షేత్రంలోకి దిగిన అభాగ్య విద్యార్థుల ఆక్రోశం చివరికి జంతర్ మంతర్ వీధులను దాటి అధికార పీఠాలను కదిలించివేసింది. కొద్ది వారాల క్రితం వరకు ఊహకు కూడా అందని కార్యాన్ని యువశక్తి సాకారం చేసి చూపించింది. ఆరని నిరసన జ్వాలలు, జంతర్ మంతర్ సాక్షిగా సాగిన ధర్నాలు, దేశవ్యాప్తంగా అట్టుడికిన విద్యార్థుల అసంతృప్తి, అంతకంతకూ పెరిగిన రాజకీయ ఒత్తిడికి తలవొగ్గక తప్పలేదు. ఆ దెబ్బకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన కుర్చీని దిగిపోవాల్సి వచ్చింది! ప్రభుత్వం రద్దయిన పరీక్షలను తిరగరాయడానికి ఒప్పుకుంది, సిబిఐ విచారణకు తలవంచింది, విద్యాశాఖ నాయకత్వాన్నే మార్చేసింది. పైకి చూడటానికి ఇది విద్యార్థుల మహా ఉద్యమానికి లభించిన అద్భుత విజయమే కావచ్చు... కానీ, సింహావలోకనం చేసుకుంటే ఉద్భవించే అసలు ప్రశ్న ఒక్కటే ఒక్క రాజీనామా భారతీయ విద్యా వ్యవస్థకు తగిలిన లోతైన గాయాలను మాన్పించగలదా?××

ఈ సమరం వెనుక ఏ రాజకీయ నీడలూ లేవు, ఏ స్వార్థ ప్రయోజనాలూ లేవు. దీని వెనుక ఉన్నదల్లా రేయింబవళ్లు కష్టపడి చదివిన లక్షలాది మంది యువతీ యువకుల వేదన! తల్లిదండ్రుల చెమట చుక్కలు, వారి జీవితకాల కష్టం, కుటుంబాల భవిష్యత్ కలలు... అన్నింటినీ ఒక్క పరీక్షపై పణంగా పెట్టిన నిరుపేద, మధ్యతరగతి బిడ్డల కన్నీటి నిరసన ఇది. కొందరు అవినీతి తిమింగలాల లంచగొండితనం తమ జీవితాలను బుగ్గిపాలు చేస్తుంటే చూస్తూ ఊరుకోవడం అన్యాయానికి బానిసకావడమేనని గ్రహించి, తిరగబడ్డ అగ్నికణం ఈ ఉద్యమం! ప్రభుత్వం కూడా తలవంచక తప్పని మహా ప్రవాహంగా ఇది మారింది.

"దేశద్రోహ శక్తులు ఈ పరిస్థితులను వాడుకోకూడదని, యువత భవిష్యత్తు రాజకీయ చదరంగంలో పావుగా మారకూడదని రాజీనామా చేస్తున్నా" అని సదరు మంత్రిగారు లేఖలో రాసుకోవచ్చు. కానీ, ముసుగు తీసి చూస్తే అక్కడ కనిపిస్తున్న సత్యం చాలా స్పష్టం?ఆ రాజీనామా ప్రజా ఆగ్రహానికి భయపడి ఇచ్చినదే కానీ త్యాగం కాదు! జంతర్ మంతర్ వీధుల్లో ఆ యువత మౌనంగా ఉండి ఉంటే, దేశమంతా ఈ నిరసన జ్వాలలు వ్యాపించకపోతే.ఈ రాజీనామాలు వచ్చేవా? ఇక్కడే ప్రజాస్వామ్య అసలు సౌందర్యం ఉంది. ప్రజల గొంతుక ఎంత శక్తివంతమైనదో, అది అధికార పీఠాల పునాదులను సైతం ఎలా కదిలించగలదో ఈ పోరాటం నిరూపించింది.అయితే, ఈ సంఘటన మన విద్యా వ్యవస్థలోని కుళ్ళిన కోణాన్ని పటాపంచలు చేసింది. పరీక్షల పేపర్ లీకేజీలు అనేది ఇప్పుడు అప్పుడప్పుడు జరిగే పొరపాటు కాదు, అదొక భయంకరమైన వ్యాధిలా వ్యవస్థను పీల్చిపిప్పి చేస్తోంది. గడిచిన కొన్నేళ్లలో అనేక రాష్ట్రాల్లో పేపర్ లీకుల వల్ల పదుల సంఖ్యలో పరీక్షలు రద్దయ్యాయి. లక్షలాది మంది అభ్యర్థుల జీవితాలు చీకటిమయమయ్యాయి. కానీ ప్రతిసారీ జరిగేదేమిటి? కొందరిని అరెస్ట్ చేయడం, కొన్ని కమిటీలు వేసి కాలయాపన చేయడం, ఉచిత హామీలు గుప్పించడం... ఆ తర్వాత మళ్లీ కథ మొదటికి రావడం! ఈసారి కూడా కేవలం ఒక మంత్రి మారి, ఆ కుళ్ళిపోయిన వ్యవస్థ అలాగే ఉండిపోతే... ఈ విజయం కేవలం ఒక భ్రమ మాత్రమే!మనకు కావాల్సింది కేవలం వ్యక్తుల మార్పు కాదు, వ్యవస్థలమార్పు!

పరీక్షలను పేపర్ లీక్ మాఫియా రాక్షస కోరల నుంచి శాశ్వతంగా విముక్తి చేయాలి.

పరీక్షా బోర్డులకు రాజకీయ జోక్యం లేని పూర్తి స్వయంప్రతిపత్తిని కల్పించాలి.

పారదర్శకమైన ఆధునిక సాంకేతికతను రంగంలోకి దించాలి. అన్నింటికంటే ముఖ్యంగా లక్షలాది మంది బిడ్డల భవిష్యత్తుతో ఆడుకునే నరరూప రాక్షసులకు జీవితంలో కోలుకోలేని విధంగా కఠినమైన శిక్షలు పడాలి!

పోటీ పరీక్షల్లో నిష్పాక్షికత, పారదర్శకత లేకపోతే యువతకు వ్యవస్థపై నమ్మకమే పోతుంది. వచ్చే ఏడాది నుంచి 'నీట్' పరీక్షను కంప్యూటర్ ఆధారిత పరీక్ష గామారుస్తున్నామని చెప్పడం మంచి పరిణామమే కావచ్చు. కానీ సాంకేతికత అనేది కేవలం ఒక సాధనం మాత్రమే, అది న్యాయానికి గ్యారంటీ ఇవ్వలేదు! నడిపించే మనుషుల్లో నైతికత, పర్యవేక్షణలో నిజాయితీ లేకపోతే... మనిషి చేసే మోసాన్నే కంప్యూటర్ కూడా పునరావృతం చేస్తుంది. ఈ చారిత్రాత్మక పోరాటం సమాజానికి ఒక గొప్ప సందేశాన్ని ఇచ్చింది. నేటి యువత కేవలం ఉద్యోగం కోసం ఎదురుచూసే అభ్యర్థులు మాత్రమే కాదు, తమ హక్కుల కోసం పోరాడే రక్షకులు!××

శాంతియుత మార్గంలో, రాజ్యాంగబద్ధంగా పోరాడి ప్రభుత్వాన్ని సైతం దిగివచ్చేలా చేయవచ్చని వారు చాటిచెప్పారు. ఇది ఏ ఒక్క సంఘానికో, పార్టీకో దక్కిన విజయం కాదు... భారతీయ యువశక్తి యొక్క అజేయమైన ఐక్యతకు లభించిన విజయం!

కానీ, ఈ విజయోత్సవాల సమరంలో ఒక చేదు నిజాన్ని విస్మరించవద్దు. ఈ రాజీనామా అనేది మనం చేరుకోవాల్సిన గమ్యం కాదు, మార్గంలో ఒక మైలురాయి మాత్రమే! రాబోయే రోజుల్లో పరీక్షల వ్యవస్థ నిజంగానే పారదర్శకంగా, సురక్షితంగా, అక్షరాలా నమ్మదగినదిగా మారితేనే...ఈ ఉద్యమానికి చారిత్రక ప్రాధాన్యత దక్కుతుంది. అలా కాకుండా, కొద్ది నెలల తర్వాత మళ్లీ ఏదో ఒక పరీక్ష పేపర్ లీక్ అయి, మళ్లీ మన బిడ్డలు కన్నీళ్లతో రోడ్లపైకి వచ్చి, అవే పాత హామీలను వినాల్సి వస్తే... మనం ఒక వ్యక్తిని మాత్రమే మార్చాం, పీడ కలలాంటి వ్యవస్థను కాదు!



## కార్గిల్ విజయ్ దివస్ వేడుకల్లో కోటపాటి రుక్మారావుకు ఘన సన్మానం

**ఖమ్మం, (జనంసాక్షి) :** కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా మాజీ సైనిక్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో గల ఫ్రీడమ్ పార్క్ లో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో దళిత రత్న అవార్డు గ్రహీత, హాస్టల్ వెల్ఫేర్ ఫోరం ఖమ్మం జిల్లా అధ్యక్షులు కోటపాటి రుక్మారావును శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇంటెలిజెన్స్ ఎస్పీ రామోజీ రమేష్, జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ చంద్రశేఖర్, మాజీ సైనిక్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రచార కార్యదర్శి ఎస్.ఎం. అరుణ్ కుమార్, ఈఎస్ఎం అసోసియేషన్ ఖమ్మం జిల్లా గౌరవ అధ్యక్షులు గోపాల్ రావు, అధ్యక్షులు సుభాని, మాజీ సైనిక్ ఉద్యోగులు హనుమంతరావు, ఎన్.రమేష్, మాజీ సైనికులు తదితరులు పాల్గొని కార్గిల్ అమరవీరులకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోటపాటి రుక్మారావు మాట్లాడుతూ, ఈ సన్మానం తనకు లభించిన విలువైన గుర్తింపుగా భావిస్తున్నానని, తనను గౌరవించిన మాజీ సైనిక్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన కార్గిల్ అమరవీరుల త్యాగం ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు.

# గులాబీ జెండాను అడ్డుకోవాలనే కాంగ్రెస్ కుట్రలు సాగవు

## మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

**ఖమ్మం కార్పొరేషన్, జూలై 26 (జనంసాక్షి)** ఖమ్మం నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని బలహీనపరిచే శక్తి ఎవరికీ లేదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ స్పష్టం చేశారు. ఖమ్మం నగరంలోని 8వ డివిజన్‌లో నూతనంగా నిర్మించిన బీఆర్ఎస్ పార్టీ జెండా దిమ్మె వద్ద జెండాను ఆవిష్కరించిన అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.



బీఆర్ఎస్ పార్టీ జెండా దిమ్మెలను తొలగించడం, గులాబీ జెండాను అడ్డుకోవడం ద్వారా పార్టీని నిలువరించాలనే కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు ఎప్పటికీ ఫలించవని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికార అహంకారంతో ప్రగల్భాలు పలుకుతున్నారని ప్రజల గుండెల్లో బీఆర్ఎస్ పార్టీకి ఉన్న స్థానం ఎవరూ చెరపలేరని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ పార్టీ బీఆర్ఎస్ అని, కోట్లాది మంది ప్రజల ఆశయాలు, త్యాగాల ప్రతీక అయిన గులాబీ జెండాను అని స్పష్టం చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఖమ్మం నగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశామని గుర్తు చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్ వంటి పథకాలతో ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకొచ్చామని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా ప్రజలకు చెప్పుకోదగ్గ ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్టలేదని విమర్శించారు. కనీస పారిశుద్ధ్య నిర్వహణలో కూడా ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఖమ్మం నగరంలో అనేక ప్రాంతాలు చెత్తకుప్పలుగా మారిపోయాయని ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

బీఆర్ఎస్ పార్టీపై రాజకీయ కక్షతో జెండా దిమ్మెలను లక్ష్యంగా చేసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ఇటువంటి బెదిరింపులకు, కుట్రలకు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఏమాత్రం భయపడరని, ప్రతి డివిజన్‌లో, ప్రతి గ్రామంలో గులాబీ జెండా మరింత ఎత్తుగా రెపరెపలాడుతుం దని ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని ఎప్పటికీ మరచిపోరని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు తగిన సమయంలో ప్రజలే గుణపాఠం చెబుతారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు.



## ఖమ్మంలో కరుణాకర్‌రెడ్డికి సన్మానం



**ఖమ్మం కార్పొరేషన్, జూలై 26( జనంసాక్షి)** తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నూతన చైర్మన్‌గా బీరోలు గ్రామానికి చెందిన తెలంగాణ హైకోర్టు సీనియర్ న్యాయవాది గుండా కరుణాకర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఖమ్మం కస్బాబజార్‌లోని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) కార్యాలయంలో ఆదివారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఎంపీజే జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాసీం అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజల హక్కుల పరిరక్షణకు ఉద్యమకారులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కొందరు స్థానికేతర వ్యాపారులు పన్నుల ఎగవేతకు పాల్పడుతున్నారని, దీనివల్ల తెలంగాణ రాష్ట్ర ఖజానాతో పాటు ప్రజల ప్రయోజనాలకు భారీ నష్టం వాటిల్లుతోందని ఆరోపించారు. ఇటువంటి అంశాలపై సంబంధిత యంత్రాంగం దృష్టి సారించాలని కోరారు.కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది, ఎంపీజే వ్యవస్థాపకుడు హైదర్ అలీ, ప్రధాన కార్యదర్శి నాసర్, సతీష్, కోశాధికారి అబ్దుల్ హకీమ్, జిల్లా నాయకులు రఫీ, రజ్జబ్ అలీ, అహ్మద్, సేవా బ్యాంకు మేనేజర్ రఫీ, రజాక్, తెలంగాణ ఉద్యమకారులు ఆసిఫ్, బురహన్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కుల పరిరక్షణకు ఏఐటీయూసీ నిరంతర పోరాటం

- ❍కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి
- ❍కనీస వేతనం రూ. 26 వేలు, ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించాలి
- ❍మోటకొండూరులో విజయవంతంగా ఏఐటీయూసీ 3వ మండల మహాసభ




**మోటకొండూరు, జులై 26 (జనం సాక్షి):-** కార్మికుల హక్కులు, వాటి పరిరక్షణ కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతుందని ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోలగాని సత్యనారాయణ స్పష్టం చేశారు. ఆదివారం మోటకొండూరు మండల కేంద్రంలో ఏఐటీయూసీ 3వ మండల మహాసభ ఘనంగా జరిగింది. ఈ మహాసభ ప్రారంభానికి ముందు ఆయన ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించే విధంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సత్యనారాయణ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాల వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, వారికి ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఐక్యంగా ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. కనీస వేతనాలు, సామాజిక భద్రత, సంక్షేమ పథకాల అమలు కోసం పోరాటాలను మరింత బలోపేతం చేయాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ మాట్లాడుతూ.. ప్రతి కార్మికునికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలతో పాటు నెలకు రూ. 26 వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సంఘటిత ఉద్యమాలు నిర్మించాలని కోరారు. అనంతరం మండలంలోని వివిధ రంగాల కార్మికుల సమస్యలపై మహాసభలో పలు తీర్మానాలు ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్మికుల హక్కుల సాధన కోసం మండల వ్యాప్తంగా ఉద్యమాలను విస్తరించాలని మహాసభ తీర్మానించింది. బీరకాయల మల్లేష్, బోల్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో సీపీఐ మండల కార్యదర్శి గాదెగాని మాణిక్యం, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, నాయకులు ఆలేటి బాలరాజు, కొల్లూరి మల్లేష్, ముసుకు పెంట రెడ్డి, బోట్ల శ్రీను, పైళ్ల రాంరెడ్డి, రేగు పాండు, నాగ చారీ, నల్ల రఘు, వడ్డెబోయిన శ్రీనివాస్, బొల్ల వెంకటేష్, సిరబోయిన వెంకటేష్, గదరాజు సురేష్, గిరబోయిన శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



## మంచానికి పరిమితమైన మిత్రునికి
# అండగా పదవతరగతి దోస్తులు

**1996-97 పదవతరగతి బ్యాచ్ విద్యార్థికి ఆర్థిక సహాయం అందిస్తున్న అప్పటి తోటి విద్యార్థులు**

**పెన్ పహాడ్, జూలై 26 (జనం సాక్షి) :** రోడ్డు ప్రమాదానికి గురై ఇరవై ఏళ్ళుగా మంచానికి పరిమితమైన మిత్రుని కుటుంబానికి అండగా నిలిచారు. నాగులపాటి అన్నారం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు...1996-97 బ్యాచ్ కి చెందిన,అన్నారం ఔ గ్రామానికి చెందిన ,పదో తరగతి విద్యార్థి పశ్య నరేందర్ రెడ్డి పదో తరగతి పూర్తికాగానే విజయవాడ వెళ్లి ప్రైవేట్ బస్సు ఆపరేటర్ గా ఉద్యోగంలో చేరాడు. ఆ క్రమంలో 2007వ సంవత్సరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వెన్నుముక దెబ్బతిని ఇరవై ఏళ్ళుగా మంచానికి పరిమితమై ఉన్నాడు. ఇటీవల పూర్వ విద్యార్థుల సమ్మేళన సందర్భంగా నరేందర్ రెడ్డి దినస్థితిని తెలుసుకున్న 1996 97 బ్యాచ్ విద్యార్థులు స్పందించి స్నేహితునికి సహాయం చేయటం కోసం దాదాపు లక్ష రూపాయలు సమీకరించారు. ఈరోజు విజయవాడలోని నరేందర్ రెడ్డి నివాసానికి వెళ్లి పరామర్శించి, వాళ్ళ కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. 30ఏండ్ల తరవాత కూడా గుర్తు పెట్టుకొని తనని పరామర్శించడానికి ఇంత దూరం వచ్చిన టెన్త్ క్లాసు మిత్రులకు నరేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశాడు. ఈ కార్యక్రమంలో 1996-97 బ్యాచ్ కి చెందిన. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఎచ్ఏతు సూర్యాపేట జిల్లా అధ్యక్షులు అయితబోయిన రాంబాబు గౌడ్, పెన్ పహాడ్ మండల యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కోన వెంకన్న, కీత రాంబాబు, నకరికంటి వెంకన్న, భోగరాజు వెంకన్న, పల్లె భాస్కర్, మీసాల సైదులు పాల్గొన్నారు.

# జానయ్య యాదవ్ ను రాజకీయంగా బలహీనపరిచే ప్రయత్నం

❍రాజకీయ కక్షతోనే వజ్రా రైస్ ఇండస్ట్రీపై దాడులు ❍టీఆర్పీ జిల్లా అధ్యక్షులు మామిడి అంజయ్య

**సూర్యాపేట (జనంసాక్షి):** వట్టె జానయ్య యాదవ్‌కు చెందిన వజ్రా రైస్ ఇండస్ట్రీపై జరిగిన దాడులు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమేనని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షులు మామిడి అంజయ్య అన్నారు. వారం రోజులుగా వజ్రా రైస్ ఇండస్ట్రీపై జరుగుతున్న ప్రచారం, ఆరోపణలన్నీ అవాస్తవాలని అన్నారు. ఆదివారం టీఆర్పీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక అధికారులు లేకుండా నేరుగా మిల్లుపై తనిఖీలు నిర్వహించారని అన్నారు. ఏ రైస్ మిల్లులోనైనా ఏదైనా అంశాల్లో లోపాలుంటే ముందుగా నోటీసులు జారీ చేస్తారని, వజ్రా రైస్ ఇండస్ట్రీ విషయంలో ఎలాంటి నోటీసు ఇవ్వకుండా నేరుగా దాడులకు దిగారని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సీఎంఆర్ బియ్యం సరఫరాలో ఎప్పుడూ విఫలం కాలేదని తెలిపారు. ఇప్పటి వరకు మిల్లుపై ఒక్క ఫిర్యాదు కూడా నమోదు కాలేదని చెప్పారు. చట్టాలను, ప్రభుత్వ నిబంధనలను గౌరవిస్తూ మిల్లు నిర్వహిస్తున్న సమయంలో అకస్మాత్తుగా ఈ చర్యలు చేపట్టడం ఏమిటని అన్నారు. వట్టె జానయ్య యాదవ్ పరారీలో ఉన్నారనే ప్రచారం పూర్తిగా అసత్యమని, ఆయన న్యాయవాదిగా కోర్టులను ఆశ్రయిస్తూ చట్టబద్ధంగానే తన హక్కుల కోసం పోరాడుతున్నారని తెలిపారు. జానయ్యను రాజకీయంగా బలహీనపర్చాలని చూస్తున్నారని అన్నారు. బీసీ నాయకులు ఎదగకుండా అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వట్టె జానయ్య యాదవ్ పై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో టీఆర్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి మీర్ అక్బర్, పట్టణ అధ్యక్షులు కుంభం నాగరాజు, మహిళా విభాగ అధ్యక్షురాలు కొన్నె మంజుల గౌడ్, ప్రధాన కార్యదర్శి నారాయణదాసు కవిత, పెన్ పహాడ్ మండల అధ్యక్షులు ఆవుల అంజయ్య, ఆత్మకూరు (ఎస్) మండల అధ్యక్షులు బొల్లె సైదులు, విద్యార్థి విభాగ అధ్యక్షులు మామిడి శోభన్, నాయకులు చాంప్ల, బోడపట్ల మధు, చింతకాయల జానయ్య, దీపమాల, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



**లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆగస్టు 9న జరిగే ప్రపంచ గిరిజన దినోత్స గోడపత్రికల విష్కరణ**

**చుంచుపల్లి జనం సాక్షి 26 జూలై**



స్థానిక చుంచుపల్లి తండాలో లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా ఇంచార్జ్ మంగీలాల్ నాయక్ ఆధ్వర్యంలో ఆగస్టు 9న చుంచుపల్లి తండా వేదికగా జరిగే ప్రపంచ గిరిజన దినోత్సవ వేడుకల గోడ పత్రికలను న్యాయవాది, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించి అనంతరం మాట్లాడుతూ గిరిజనుల ఆగస్టు 9న జరిగే ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలకు లంబాడీలు వేలాదిగా తరలి వచ్చి జయప్రదం చేయాలని చట్టాలైన పెసా,1/70, హక్కుల రక్షణ, వారి సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించాలని,రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ క్లాజ్ (2) మరియు పేరా 5(1) ప్రకారం గవర్నర్ మరియు రాష్ట్రపతికి ఉన్న ప్రత్యేక విచక్షణాధికారాలను ఉపయోగించి ఏజెన్సీ ప్రాంతాల్లో 100% రిజర్వేషన్లను పునరుద్ధరించవచ్చని, దీనికి సంబంధించి 112వ గిరిజన సలహా మండలి (ఎం) సమావేశంలో కూడా ఏకగ్రీవ తీర్మానం చేయాలని. ఈ రిజర్వేషన్లు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14,15,16లకు భంగం కలిగించవని, గిరిజన సంస్కృతి, సామాజిక భద్రత కల్పించాలని నిరుద్యోగంతో కొట్టుమిట్టాడుతున్న నిరుపేద ఏజెన్సీ ప్రాంత గిరిజనులకు 100% ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్ల ఉత్తర్వులు జారీ చేసిన తర్వాతనే డిఎస్సీ ఇతర ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని షెడ్యూల్డ్ ప్రాంతాలలో తక్షణమే గిరిజనులకు ప్రత్యేకంగా "స్పెషల్ డిఎస్సీ నిర్వహించి ఖాళీలను భర్తీ చేయాలని. రాజ్యాంగం 5వ షెడ్యూల్ క్లాజ్-2 ప్రకారం గిరిజనులకు 100% ఉద్యోగ రిజర్వేషన్ల కోసం రాష్ట్రపతి ఉత్తర్వులు పొందేలా చర్యలు తీసుకోవాలని. రద్దయిన జి.ఓ. నెం. 3 స్థానంలో ప్రత్యామ్నాయ చట్టబద్ధమైన జి.ఓ ను విడుదల చేయాలని, 5వ షెడ్యూల్డ్ ఏరియాలో రాజ్యాంగబద్ధమైన చట్టాలు, గిరిజన హక్కులను పటిష్టంగా అమలు చేయాలని ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ తెలంగాణ ప్రభుత్వాలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా నాయకులు లక్ష్మణ్ నాయక్, న్యాయవాది నవీన్ నాయక్, కిషన్ నాయక్, రమేష్, వెంకటి, యోగి తదితరులు పాల్గొన్నారు.

# ఫోటోగ్రాఫర్ల సంక్షేమానికి రాష్ట్ర సంఘం నిరంతర కృషి

- ❍ఉచిత వైద్య శిబిరం, జిల్లా కార్యాలయం ప్రారంభం
- ❍మృతుని కుటుంబానికి రూ.4.10 లక్షల చెక్కు అందజేత
- ❍రాష్ట్ర ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్కే హుస్సేన్




**భూదాన్ పోచంపల్లి, జూలై 26 (జనం సాక్షి):** ఫోటోగ్రాఫర్ల సంక్షేమం కోసం రాష్ట్ర ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే హుస్సేన్ అన్నారు. భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో, వివేర్ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం లక్ష్మణ్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన జిల్లా సంఘ కార్యాలయాన్ని రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇటీవల రామన్నపేట మండలానికి చెందిన ఫోటోగ్రాఫర్ నకిరికంటి మహేష్ మృతి చెందగా, కుటుంబ భరోసా పథకం కింద ఆయన కుటుంబ సభ్యులకు రూ.4.10 లక్షల ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. జిల్లా అధ్యక్షుడు భోగ చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్కే హుస్సేన్ మాట్లాడుతూ, ఫోటోగ్రాఫర్ల ఐక్యత వల్లే సభ్యుల కుటుంబాలకు లక్షల రూపాయల ఆర్థిక సాయం అందించడం సాధ్యమైందన్నారు. సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఫోటోగ్రాఫర్లు తమ నైపుణ్యాలను పెంపొందించుకొని కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. సంఘ ఐక్యతను దెబ్బతీయాలనే ప్రయత్నాలను తిప్పికొట్టి, అందరూ సంఘ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ జగదీష్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గ్రామాల అప్పిరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి చిలువేరు ప్రవీణ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు బొమ్మగాని గణేష్, జిల్లా గౌరవ సలహాదారుడు హరీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి హరి రెడ్డి, కోశాధికారి తునికి దశరథ్, మండల సంఘం అధ్యక్షుడు కేఎం విష్ణుమూర్తి, ప్రధాన కార్యదర్శి రవ్వ నవీన్, ఉపాధ్యక్షుడు చెక్క మల్లేష్, కోశాధికారి సకినాల సిద్దేశ్వర్, సహాయ కార్యదర్శి దొడ్డమోని వంశీధర్, గౌరవ సలహాదారు రచ్చ వినోద్, కార్యవర్గ సభ్యులు విఘ్నేష్, వంగూరి నరేష్, తవటం ఉమాకాంత్, పెద్దిరెడ్డి వెంకటేష్, బేటి నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ నుంచి వచ్చిన వారికే పదవులా..?

◆అసలైన కాంగ్రెస్ కార్యకర్తలకు గుర్తింపు ఎప్పుడు..?

◆మునుగోడు కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే వర్గం ?

◆కార్యకర్తల మధ్య పెరుగుతున్న అసంతృప్తి..



**మర్రిగూడ, జూలై 26 (జనం సాక్షి )**
మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు బహిర్గతమవుతున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు కాంగ్రెస్‌లో కొత్త చర్చకు దారితీశాయి.
తుంగతుర్తి నియోజకవర్గంలో అభివృద్ధి జరగడం లేదని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించగా, దీనికి ప్రతిస్పందించిన మందుల సామేల్ ముందుగా మునుగోడు నియోజకవర్గంలో అభివృద్ధి పరిస్థితిని చూసుకోవాలని, అక్కడే ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని వ్యాఖ్యానించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. మందుల సామేల్ చేసిన వ్యాఖ్యలపై స్పందించిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, "కాంగ్రెస్‌లో నిజమైన కార్యకర్తలకు గుర్తింపు ఉంటుంది" అని చెప్పిన నేపథ్యంలో మునుగోడు కాంగ్రెస్‌లోనే ఆ వ్యాఖ్యలపై ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఉప ఎన్నికల సమయంలో కాంగ్రెస్ జెండాను భుజాన వేసుకుని పార్టీ కోసం కష్టపడ్డ నాయకులు, కార్యకర్తలకు ఇప్పటికీ తగిన గుర్తింపు దక్కలేదని పలువురు కాంగ్రెస్ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.
అదే సమయంలో ఉప ఎన్నికల సమయంలో బీజేపీలో చేరి, ఎన్నికల అనంతరం తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చిన వారికి మాత్రం కీలక పదవులు, ప్రాధాన్యత లభిస్తోందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దీంతో మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్న కార్యకర్తలు నిరుత్సాహానికి గురవుతున్నారని అంటున్నారు.
నియోజకవర్గానికి భారీగా నిధులు వస్తాయని, అభివృద్ధి పరుగులు తీస్తుందని ప్రజలు ఆశించినప్పటికీ, దాదాపు 33 నెలల కాలంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి కనిపించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితి ఎమ్మెల్యే ప్రతిష్టపై కూడా ప్రభావం చూపుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.
మంత్రి పదవిపైనే ఎమ్మెల్యే దృష్టి ఎక్కువగా ఉందని, నియోజకవర్గ అభివృద్ధిపై తగిన శ్రద్ధ లేదని ప్రజల్లో విమర్శలు వ్యక్తమవుతున్నాయని స్థానిక రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.
పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలకు సముచిత గుర్తింపు, బాధ్యతలు కల్పించకపోతే భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీకి నష్టం తప్పదని, ఇది రానున్న ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశం ఉందని పలువురు కాంగ్రెస్ నాయకులు అభిప్రాయపడుతున్నారు.



# కష్టానికి ప్రతిఫలం.. నర్సింగ్ ఆఫీసర్‌గా నలంద విజయం..

**- నలంద విజయం నేటి యువతకు ఆదర్శం**
**సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**

**ఖమ్మం రూరల్, జూలై 26:(జనం సాక్షి )**
ఎదులాపురం మున్సిపాలిటీ 32వ వార్డుకు చెందిన కర్నే లక్ష్మయ్య, కర్నే ఎస్తేరు రాణి దంపతుల కుమార్తె కర్నే నలంద తన కృషి, పట్టుదలతో వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రిలో నర్సింగ్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించి కుటుంబంతో పాటు ప్రాంతానికి గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా ఆదివారం సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ సాలధ్యంలో సిపిఐ కౌన్సిలర్లు, సిపిఐ నాయకులు ఆమెను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ నలంద విజయం నేటి యువతకు ఆదర్శమని కొనియాడారు. లక్ష్యసాధనకు నిరంతర శ్రమ, పట్టుదలే విజయానికి మూలమని పేర్కొన్నారు. నలంద భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ఐఏఎల్ జాతీయ సమితి సభ్యుడు శేషగిరి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, 32, 30వ వార్డుల కౌన్సిలర్లు మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి, దండి శ్రీజ, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయ సుధాకర్, సిపిఐ నాయకులు మామిడి సుదర్శన్ రెడ్డి, వెన్నం భాస్కర్, దొంతగాని వెంకన్న, ఉపాధ్యాయుడు ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధినేని హేమలత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కూనంనేని

**- చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి**



**ఖమ్మం రూరల్, జూలై 26:(జనం సాక్షి )**
ఖమ్మం రూరల్ మండలం గూడూరుపాడు గ్రామానికి చెందిన సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిద్ధినేని కర్ణకుమార్ తల్లి సిద్ధినేని హేమలత ఇటీవల మృతి చెందారు. ఆ సమయంలో వ్యక్తిగత, పార్టీ కార్యక్రమాల కారణంగా పరామర్శకు హాజరుకాలేకపోయిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆదివారం వారి నివాసానికి వెళ్లి వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి చిత్రపటానికి సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్ తో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి,పార్టీ తరఫున అన్ని వేళలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఖమ్మం రూరల్ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, సిపిఐ గ్రామ మాజీ సర్పంచ్ బండి ఉపేందర్, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి బండి సాయి, సహాయ కార్యదర్శి దాసరి పున్నయ్య, గ్రామ నాయకులు గోగినపల్లి రామ్మూర్తి, సిద్ధినేని బోసు, కర్ణం ఉపేందర్, పొడేటి అంజయ్య, భాస్కర్, హేమంత్, వెంకట నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న విద్యుత్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీల నిరసన



**భద్రాచలం జూలై 26 (జనంసాక్షి)**
రాష్ట్ర టీజీపీఈజేఏసీ పిలుపు మేరకు విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ యాదాద్రి థర్మల్ పవర్) స్టేషన్ ఉద్యోగులు చేస్తున్న న్యాయమైన ఆందోళనకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ ఎన్పీడీసీఎల్ ఉద్యోగులు ఆదివారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భద్రాచలం జేఏసీ జిల్లా కన్వీనర్, భద్రాచలం విద్యుత్తు సంస్థ డీఈ జీవన్ కుమార్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యోగులంతా ఏకం కావలసిన సమయం ఆసన్నమైందని అన్నారు. కార్మికులు ఉద్యోగులు ఉద్యోగుల సంఘాలన్నీ ఏకమైనప్పుడే సమస్యలకు పరిష్కారం లభిస్తుంది అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటు కరిస్తే ఉద్యోగులు మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని, అంతా ఒక తాటి పైకి వచ్చి ఉద్యమించి న్యాయమైన హక్కులను పరిరక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీజీపీఈజేఏసీ కార్యవర్గ సభ్యులు ఏడీఈ నరసింహారావు, వెంకట్రావు, రామకృష్ణ, ఉదయ్, కేటీఎన్ మూర్తి, పెదరాజు, ప్రవీణ్, రాజారావు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయి ప్రజా పోరాటాల తోనే కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం

◆మోడీ ప్రభుత్వ మెడలు వంచిన యువత పోరాటం

◆సిపియం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎజె రమేష్






**కొత్తగూడెం జనంసాక్షి**
క్షేత్రస్థాయి పోరాటాలు నిర్మించి ప్రజా సమస్యల పరిష్కారంలో కృషి చేసినప్పుడే కమ్యూనిస్టు పార్టీ బలపడుతుందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ తెలిపారు. స్థానిక మంచి కంటి భవన్లో సిపిఎం రెండవ రోజు రాజకీయ శిక్షణ తరగతుల్లో భాగంగా పార్టీ నిర్మాణం క్లాస్ బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు కష్టాలు వస్తే కమ్యూనిస్టులు గుర్తుకు రావాలని ఎన్నికలు ఓట్లు సీట్లతో సంబంధం లేకుండా నిరంతరం ప్రజా సమస్యలపై కమ్యూనిస్టులు పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్మించినప్పుడు మాత్రమే కమ్యూనిస్టు పార్టీ విస్తరణ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. దేశంలో గత నెల రోజులుగా ఈ దేశ విద్యార్థులు యువత సాధించిన మహత్తర పోరాటం మోడీ ప్రభుత్వం మెడలు వంచిందని భవిష్యత్తు పోరాటాలకు ఈ పోరాటం స్ఫూర్తిదాయక మని ఆయన తెలిపారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న పోరాటానికి అనేకమంది మోడీ ప్రభుత్వ అనుకూలమైన వ్యక్తులు కార్పొరేట్ మీడియా పోరాటాన్ని వక్ర భాష్యాలు చెప్పి పక్కదారి పట్టించే ప్రయత్నం చేసినప్పటికీ అంతిమంగా విద్యార్థుల పోరాటమే విజయం సాధించిందని తెలిపారు. విద్యార్థులు పట్టుదలతో ప్రారంభించిన ఏ పోరాటం విఫలం కాలేదని అది చరిత్ర రోజు రుజువు చేసిందని ప్రస్తుతం మన దేశంలో అదే జరిగిందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మాటలతో కాలం తీస్తుంది తప్ప ఇచ్చిన వాగ్దానాల అమలుకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు కుప్పలు తెప్పలుగా పేరుకు పోతున్నాయని ఈ సమస్యల పరిష్కారానికి సిపిఎం పోరుబాట కార్యక్రమానికి శ్రీకారం చుడుతుందని క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమరసిల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు పెద్ద పెద్ద వాగ్దానాలు ఇచ్చిన ప్రభుత్వం వాటి అమలు కోసం నిర్దిష్టంగా ఎటువంటి బడ్జెట్ కేటాయింపులు కేటాయించడం లేదని ఆ హామీలన్నీ నీటి మీద రాతలు గానే మిగిలిపోతున్నాయని విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పెన్షన్లు ఇతర ప్రభుత్వ స్కీముల ఎంపికలో రాజకీయ వివక్షత కొనసాగుతుందని అసలైన లబ్ధిదారులకు నిరుపేదలకు క్షేత్రస్థాయిలో తీవ్రమైన అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు మొత్తం ప్రభుత్వ రంగానికి సంబంధించిన అన్ని రకాల విద్యాసంస్థల సందర్శించి సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. రేషన్ షాపుల ద్వారా పద్నాలుగు రకాల నిత్యవసర సరుకులను ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు. నిరంతరం ప్రజలతో ఉంటూ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలలో కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు ముందుండాలని ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు అందే విధంగా మధ్య దళారులకు అవకాశం లేకుండా పోరాటాలు చేయాల్సిన బాధ్యత కమ్యూనిస్టులపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ కార్యదర్శి వర్గ సభ్యులు నందిపాటి రమేష్ టౌన్ కమిటీ సభ్యులు ఆవుల శ్రీరాములు ఆలేటి శ్రీనివాస్ జయశ్రీ నాగకృష్ణ నాయకులు కేహెచ్ ప్రసాద్ ఎంఎస్ ప్రకాష్ రాజారావు ఎం శ్రీను వై వెంకటేశ్వరరావు ఎన్ఎస్ రాజు రజిత గిరి శివ దుర్గమ్మ బాలకృష్ణ రాములు రఘు నరసింహారావు నసూర్ నాగదుర్గ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# 29 లేబర్ కోడ్ చట్టాలను యధావిధిగా అమలు చేయాలి

◆ ఆగస్టు 10న జైలు భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయండి ◆ సిఐటియు భద్రాద్రి జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్ నబీ

**ఆళ్లపల్లి జూలై 26(జనంసాక్షి)**

మండల పరిధిలోని జిన్నెల్లగూడెం గ్రామంలో క్విట్ ఇండియా ఉద్యమ పూర్తితో ఆగస్టు 10వ తారీఖున జరిగే జైల్ బరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.సిఐటియు భద్రాద్రి జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్ నబీ,అల్లపల్లి మండల కన్వీనర్ సుగుణ,కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్ చట్టాలను వెంటనే రద్దుచేసి 29 లేబర్ కోడ్ చట్టాలను యధావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు కార్మికులు కర్షకులు వ్యవసాయ కూలీలు క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10వ తారీఖున జరిగే జైల్ భరో కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఇప్పుడున్న బిజెపి కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తెచ్చి ధర్నా చేసే రైతులను విచక్షణంగా కొట్టించి రైతులపై కేసులు పెట్టి జైలులో పెట్టించిన దుస్థితి బిజెపి ప్రభుత్వం దని ఎద్దేవా చేశారు దేశంలో ఉన్న రైతాంగం మొత్తం తిరగబడుతున్నా రని అర్థమై రైతులకు క్షమాపణలు చెప్పి ఆ చట్టాలను తొలగించడం జరిగిందని తెలిపారు (సిజేపి) కాక్రోచ్ జనతా పార్టీకి మద్దతుగా యువత విద్యార్థులు నీట్ ప్రశ్న



పత్రాలు లీకేజీ వల్ల విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం కేంద్ర ప్రభుత్వం పట్టించుకోక పోవడంవల్ల యువత విద్యార్థులకు న్యాయం చేయకుండా కేంద్ర ప్రభుత్వం ఆర్మీ పోలీసులతో ఆందోళన కారులపై లాఠీచార్జి చేసిన ఆందోళన విరమించుకోకపోవడం వల్ల వెనకడుగు వేయకుండా మరింత ఆందోళనలు మరింత ముందు సాగడం ఎక్కువైతే కేంద్ర ప్రభుత్వంపై వ్యతిరేకత. వస్తుందని భయపడి కేంద్ర విద్యా శాఖ మంత్రిని వెంటనే రాజీనామా చేయించారని తెలిపారు భవిష్యత్తులో కార్మిక వర్గం నాలుగు లేబర్ కోడ్ రద్దుచేసి 29 చట్టాలు పునరుద్ధన అయ్యేవరకు పోరాటం ఆగదని తెలిపారు.ఈ కార్యక్రమంలో చంద్రకళ, సునీత, లక్ష్మీకాంత, దొడ్డి రాము, అనసూయ, లీలావతి,తిరుపతమ్మ, అన్నపూర్ణ, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధినేని హేమలత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కూనంనేని
## చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి

**ఖమ్మం రూరల్, జూలై 26:(జనం సాక్షి )**



ఖమ్మం రూరల్ మండలం గూడూరుపాడు గ్రామానికి చెందిన సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిద్ధినేని కర్ణకుమార్ తల్లి సిద్ధినేని హేమలత ఇటీవల మృతి చెందారు. ఆ సమయంలో వ్యక్తిగత, పార్టీ కార్యక్రమాల కారణంగా పరామర్శకు హాజరుకాలేకపోయిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆదివారం వారి నివాసానికి వెళ్లి వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా మృతురాలి చిత్రపటానికి సీపీఐ జాతీయ



సమితి సభ్యుడు భాగం హేమంతరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్ తో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి,పార్టీ తరఫున అన్ని వేళలా అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ ఖమ్మం రూరల్ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, సిపిఐ గ్రామ మాజీ సర్పంచ్ బండి ఉపేందర్, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి బండి సాయి, సహాయ కార్యదర్శి దాసరి పున్నయ్య, గ్రామ నాయకులు గోగినపల్లి రామ్మూర్తి, సిద్దినేని బోసు, కర్ణం ఉపేందర్, పొడేటి అంజయ్య, భాస్కర్, హేమంత్, వెంకట నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లా ఖోఖో అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

జిల్లా అధ్యక్షుడిగా మువ్వా విజయబాబు, ప్రధాన కార్యదర్శిగా పసుపులేటి వీర రాఘవయ్య

**కల్లూరుజూలై 26(జనం సాక్షి)**

ఉమ్మడి ఖమ్మం జిల్లా ఖోఖో అసోసియేషన్ నూతన కమిటీ జిల్లా అధ్యక్షులుగా మువ్వ విజయబాబు, ప్రధాన కార్యదర్శిగా పసుపులేటి వీరరాఘవయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం కల్లూరులోని పిఎమ్ శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా ఖో ఖో అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికల సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ అధ్యక్షులు జంగా రాఘవ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాతి కృష్ణమూర్తి సహకారంతో ఎన్నికల అబ్జారావర్ శాంప్రసాద్ డి ఎస్ ఏ అబ్జార్వర్ పరిపూర్ణ చారీ ఖమ్మం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ క్రిస్టోఫర్ బాబు, ఉపాధ్యక్షులు ఉప్పల్ రెడ్డి జిల్లా అథ్లెటిక్స్ కొచ్ గౌస్ ల ప్రత్యక్ష పర్యవేక్షణ సహకారంతో ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తయింది.ఈ సమావేశానికి ఉమ్మడి ఖమ్మం జిల్లా నలుమూలల నుండి భారీ సంఖ్యలో వ్యాయామ ఉపాధ్యాయులు , వ్యాయామ దర్శకులు ఖోఖో శిక్షకులు



న్యాయ నిర్ణేతలు సీనియర్ క్రీడాకారులు హాజరయ్యారు. అందరి ఆమోదంతో రాబోయే కాలానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఖమ్మం జిల్లా నూతన అధ్యక్షులుగామువ్వా విజయబాబు ప్రధాన కార్యదర్శి పసుపులేటి వీరరాఘవయ్య కోశాధికారిచెరుపల్లి శ్రీహరిఉపాధ్యక్షులు పుణ్యపూర్తి నరసయ్య, ఎస్. రామారావు, సిహెచ్. కృష్ణయ్య జాయింట్ సెక్రటరీలు పి. పవన్ కుమార్, ఎ. కృష్ణ, జి. శ్యాంబాబుఈసీ మెంబర్లు బి. రాము, ఎస్. ప్రసాద్, ఎ. సమ్మయ్య, ఎన్. వెంకటేశ్వర్లు, పద్మతదితరులుఎన్నికైనరు గ్రామీణ ప్రాంతాలలో ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసి, వారికి నాణ్యమైన శిక్షణ వసతులు కల్పించాల్సిన బాధ్యత నూతన కమిటీపై ఉన్న దృష్ట్యా భవిష్యత్తులో రాష్ట్ర జాతీయ స్థాయి పోటీలలో ఖమ్మం జిల్లా క్రీడాకారులు విజేతలుగా నిలిచేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు పిలుపునిచ్చారు. తమపై నమ్మకంతో జిల్లా ఖో ఖో అసోసియేషన్ బాధ్యతలను అప్పగించిన రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ నాయకులకు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధులకు సహకరించిన పీఈటీలు, పీడీలు, కోచ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లాలో ఖోఖో క్రీడా వికాసానికి, క్రీడాకారుల నైపుణ్యాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తామని హామీ ఇచ్చారు.

# ఎన్ఓసీ నిబంధనలు పాటించని భూ యజమాని.!

- విలువైన భూమి కావడంతో బఫర్ జోన్‌లోనే ఇండ్ల నిర్మాణాలు
- నిర్మాణాల్లో మున్సిపాలిటీ నిబంధనలకు సైతం తిలోదకాలు

**ఖమ్మం రూరల్, జూలై 26:(జనం సాక్షి )**



ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 27వ వార్డులో ఎన్ఓసీ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఆక్రమిత స్థలంలో ఇండ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.తాళ్లేసి తండాకు చెందిన ఓ భూ యజమాని తన భూమిలో ఉన్న పంట కాలువకు సంబంధించి ఇరిగేషన్ శాఖ నుంచి ఎన్ఓసీ పొందినట్లు సమాచారం. అయితే ఎన్ఓసీ నిబంధనల ప్రకారం పంట కాలువ నుంచి ఆరు అడుగుల మేర బఫర్ జోన్‌ను తప్పనిసరిగా ఖాళీగా ఉంచాల్సి ఉంటుంది. కానీ భూమి విలువ అధికంగా ఉండటంతో ఆ నిబంధనలను పట్టించుకోకుండా ఓ బిల్డర్ బఫర్ జోన్‌ను సైతం ఆక్రమించి ఇండ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే మున్సిపాలిటీ ఇచ్చిన అనుమతుల ప్రకారం నిర్మాణాలు జరగడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకుస్పందించకపోవడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, వాస్తవాలను నిర్ధారించి అక్రమాలు జరిగి ఉంటే తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రజా సంక్షేమం, పార్టీ బలోపేతమే ధ్యేయంగా ముందుకు సాగాలి
## రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్

**కల్లూరు జూలై 26(జనం సాక్షి)**

ప్రజా సంక్షేమం పార్టీ బలోపేతమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, బూత్ స్థాయి ఏజెంట్లు సమన్వయంతో ముందుకు సాగాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పిలుపునిచ్చారు . ఆదివారంకల్లూరు రైతు వేదికలో ఆదివారం మండల పరిధిలోని 63 పోలింగ్ బూత్‌ల ఏజెంట్లతో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టా దయానంద్ మాట్లాడుతూ, పార్టీకి బూత్ స్థాయి కార్యకర్తలే వెన్నుముక అని పేర్కొన్నారు. ప్రతి ఒక్క ఏజెంట్ తమ పరిధిలోని 63 బూత్‌లలో ఓటర్లతో నిరంతరం మమేకమై, ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషిచేయాలనిపిలుపునిచ్చారు.రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను మరింత ఉధృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీ బలోపేతానికి స్థానిక నాయకులు, కార్యకర్తలు, బి.ఎల్.ఎ లు సమన్వయంతో పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోట్రు అర్జున్ రావు , కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ ఉస్మాన్ , ఎ ఏం సి డైరెక్టర్ లింగన్న బోయిన పుల్లారావు, కార్యకర్తలు 63 బూత్‌ల ఏజెంట్లు పాల్గొన్నారు.

# దివ్యాంగ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం

◆ విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు
◆ దివ్యాంగ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భానోతు లక్ష్మ

**టేకులపల్లి,జూలై 26(జనంసాక్షి):**

హైదరాబాద్‌లోని నాంపల్లి ప్రకాశం హాల్‌లో ఆదివారం (26-07-2026) నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర దివ్యాంగ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం విజయవంతమైందని తెలంగాణ రాష్ట్ర దివ్యాంగ ఉద్యోగుల సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి బాణోతు లక్ష్మ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో దివ్యాంగ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సంఘ నాయకులు పాల్గొని సమ్మేళనాన్ని విజయ వంతం చేశారని పేర్కొన్నారు. దివ్యాంగ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం, సంక్షేమ చర్యల అమలుపై సమగ్రంగా చర్చలు జరిగాయని తెలిపారు.సభకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రి ఆట్లూరి లక్ష్మణ్ దివ్యాంగ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని సభావేదికగా హామీ ఇవ్వడం అభినందనీయమన్నారు. అలాగే దివ్యాంగుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్న ముత్తినేని వీరయ్య వర్మకి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ మహాసమ్మేళనాన్ని విజయవంతం చేయడంలో తెలంగాణ రాష్ట్ర దివ్యాంగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ హబీబ్ మియా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా నాయకులు రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా జనసమీకరణ నిర్వహించి సభను విజయవంతం చేయడంలో విశేష కృషి చేశారని కొనియాడారు.అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు మాలోత్ జగ్గుదాస్ జిల్లా నుంచి అధిక సంఖ్యలో దివ్యాంగ ఉద్యోగులను సమీకరించి సభా ప్రాంగణా నికి తీసుకువచ్చి కార్యక్రమ విజయానికి విశేషంగా సహకరించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేసిన తెలంగాణ రాష్ట్రంలోని 33



జిల్లాల దివ్యాంగ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సంఘ నాయకులు, అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి పాల్గొన్న ప్రతి సభ్యునికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు.దివ్యాంగ ఉద్యోగుల హక్కుల సాధనకు ప్రతి మండలం, ప్రతి జిల్లా స్థాయి లో ఐక్యంగా ఉద్యమిస్తూ,సంఘటిత శక్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఐక్యత ద్వారానే దివ్యాంగ ఉద్యోగుల సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.